
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 13.03.2015, శుక్రవారం
సంపుటి : 34 సంచిక : 41
పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## నిరుత్సాహంగా...
# సభా సమరం

- అసెంబ్లీలో విజ్ఞులు, అనుభవజ్ఞుల కొరత
- గత వైభవాన్ని కోల్పోయిన ఏపి శాసనసభ



**ఆంధ్రప్రదేశ్ శాసనసభ... ఒకప్పటి వెలుగును కోల్పోయింది. ఒకప్పటి హుందాతనం కనిపించకుండా పోయింది. గత వైభవానికి గుర్తుగా నిలిచిపోయింది.**

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలకు, నెల్లూరు నగర పాలకసంస్థ కౌన్సిల్ సమావేశాలకు పెద్దగా తేడా కనిపించడం లేదు. ఏపి అసెంబ్లీ అంటే ఒకప్పుడు రాజకీయ యోధులకు వేదికగా ఉండేది. సభలో ఎందరో గౌరవప్రదమైన సభ్యులుండేవాళ్లు. ఏదన్నా అంశం మీద చర్చ మొదలుపెడితే దానిమీద పలువురు సభ్యులు మాట్లాడే తీరు ఎంతో ఆసక్తికరంగా ఉండేది. నెల్లూరు జిల్లాకు చెందిన నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, యం.వెంకయ్యనాయుడు వంటి నాయకులు అసెంబ్లీలో ప్రసంగాల ద్వారానే ప్రజల్లో పాపులర్ అయ్యారు. వాళ్లు సబ్జెక్ట్ మీద మాట్లాడేవాళ్లు. ప్రజాసమస్యలను విస్తృతంగా చర్చకు తెచ్చేవాళ్లు. కాలానుగుణంగా శాసనసభలోకి కొత్తవారు వస్తున్నా, (మిగతా 10వ పేజీలో)

# ఆరోగ్యానికి చిరునామాగా 'అపోలో'


7లో

అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పక్కన అపోలో గ్రూప్ ఛైర్మెన్ ప్రతాప్ సి రెడ్డి, రాజ్యసభసభ్యులు టి.సుబ్బరామిరెడ్డి, మంత్రి పి.నారాయణ

## క్లైమాక్స్‌లో...
# ఎమ్మెల్సీ వార్





**రా**ష్ట్రంలో కొన్ని ఎమ్మెల్సీల భర్తీకి సమయం ఆసన్నమైంది. ముందుగా ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలను ఎంపిక చేయనున్నారు. రాష్ట్ర శాసనమండలిలో 28ఎమ్మెల్సీలను కొత్తగా ఎన్నుకోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో నెల్లూరుజిల్లాకు రెండు ఎమ్మెల్సీలను కేటాయించవచ్చనే ప్రచారం జోరుగా వుంది. జిల్లాకు వచ్చేసరికి ఎమ్మెల్సీ రేస్‌లో మొదటగా తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేరే వినిపిస్తోంది. జిల్లాలో పార్టీని నిలబెట్టుకోవడానికి కూడా సోమిరెడ్డి నాయకత్వం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

2014 ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక (మిగతా 10వ పేజీలో)

# పవన్‌కు దారేది?



- మెగాస్టార్‌ను నయమనిపిస్తున్న పవర్‌స్టార్

**మెగాస్టార్ చిరంజీవి బాటలోనే ఆయన 'తమ్ముడు' పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ కూడా పయనిస్తున్నట్లుగా వుంది. రాజకీయాలపై పూర్తి అవగాహన లేకుండా కేవలం సినీగ్లామర్ ఉంది కదా అని మనం ఏం చేసినా చెల్లుబాటవుతుందనే నమ్మకంతో చేస్తున్న చిన్న చిన్న పొరపాట్లే వారి ఇమేజ్‌ను భారీ స్థాయిలో డామేజ్ చేస్తున్నాయి.**

2008లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీని స్థాపించాడు. 2009 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేసారు. అప్పుడు రాష్ట్రంలో 42లోక్‌సభ స్థానాలుంటే ఒక్కటి కూడా గెలుచుకోలేకపోయాడు. 18అసెంబ్లీలను గెలిచారు. తర్వాత పార్టీని కొనసాగించడం కష్టమైంది. ఆర్థికంగానూ భారమైంది. అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ పెద్దలతో బేరమాడుకున్నాడు. రాజ్యసభ, కేంద్రమంత్రి పదవి ఆఫర్‌తో దిగొచ్చి ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశాడు. 2014ఎన్నికల దాకా కూడా కేంద్రంలో మంత్రిగా కొనసాగాడు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్సే లేకుండా (మిగతా 10వ పేజీలో)



# ఆ కోటి నిధులు ఏమైనట్లు!

ఆత్మకూరు పట్టణం మేజర్ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడేషన్ అయి ముచ్చటగా మూడేళ్లవుతుంటే.. అక్షరాలా కోటి రూపాయల నిధులు గోల్‌మాల్ అయిన వైనం తాజాగా వెలుగులోకొస్తోంది.

మున్సిపాలిటీగా మారిన సమయంలో స్టార్ట్‌అప్ గ్రాంట్ కింద రూ. 2కోట్ల నిధులు ప్రత్యేకంగా మంజూరయ్యాయి. అందులో దాదాపు రూ.కోటి మొత్తం వరకు లెక్కలు తేలడం లేదని మున్సిపల్ కౌన్సిల్ వై.ఎస్.ఆర్.సి పక్షం సభ్యులు ఇటీవల సర్వసభ్య సమావేశంలో భాగంగా మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. గతంలో ఆత్మకూరు ఎమ్మెల్యేగా, అటు రాష్ట్ర ఆర్థిక మంత్రిగా రాణించిన ఆనం రామనారాయణరెడ్డి తన స్వంత నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరు చేయించుకున్నారు. ఆ క్రమంలో ఆత్మకూరును మున్సిపాలిటీ చేయడంతో సహా, ప్రత్యేకంగా రూ. 2కోట్ల నిధులు విడుదల చేయించడంలోనూ శ్రద్ధ చూపారు. ఆ మొత్తంలో కోటి రూపాయలు మున్సిపల్ భవంతికి మరో కోటి రూపాయలు రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి మంజూరు చేశారు. అయితే, ఈ నిధులు మంజూరైన అనతికాలంలోనే రాష్ట్రంలో సమైక్యాంధ్ర సెగ రాజుకోవడం, ఆ తర్వాత రాష్ట్రపతి పాలన రావడం ఆత్మకూరు మున్సిపల్ అధికారులకు ఎంచక్కా కలిసివచ్చింది. భవనం, రోడ్లకు చెందిన నిధులను అత్యవసర పద్దు కింద చూపుతూ, విద్యుత్తు బిల్లులు, పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు చెల్లించినట్లుగా లెక్కల్లో కనబరిచారు. అవికూడా ఆరా తీస్తే.. కేవలం కోటి రూపాయలకు మాత్రమే లెక్కలు సమ న్వయం కావడం గమనార్హం. ఈ అక్రమ తంతు సమాచారం జిల్లా కలెక్టర్ వరకు వెళ్ళింది. ఇదే కారణమో! ఏమో కానీ.. కొద్ది నెలల క్రితం బదిలీపై పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు బదిలీపై వెళ్ళిన పాత మున్సిపల్ మేనేజర్ అమర్‌నాథ్ తిరిగి వచ్చి వారం రోజులపాటు ఇక్కడ ఇప్పటి అధికారులకు వివరాలు చూపి వెళ్ళాల్సి వచ్చింది. అయినా సరే, ఆ లెక్కలు సరి తేలకపోవడంతో కౌన్సిల్ సమావేశంలో వైసిపి సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అధికారులు చేతులెత్తేశారు.

**అధికారుల అవినీతిపై కత్తులు దూస్తున్న వై.ఎస్.ఆర్ కాంగ్రెస్**

# కావలి, కందుకూరులో కేంద్రీయ విద్యాలయాలు

**- నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి**

నెల్లూరుజిల్లా కావలి, ప్రకాశం జిల్లా కందుకూరులో వచ్చే విద్యాసంవత్సరం నుంచి కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. కావలిలో కేంద్రీయ విద్యాలయంను తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు పట్టణంలోని జడ్పీ పాఠశాలలోని తరగతి గదులను ఎంపి విద్యాశాఖ అధికారులతో కలసి 7వ తేదీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావలిలో కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి రుద్రకోట వద్ద పది ఎకరాల స్థలాన్ని కలెక్టర్ మంజూరు చేయగా కందుకూరులో ఎనిమిది ఎకరాలను ప్రకాశం జిల్లా కలెక్టర్ మంజూరు చేశారని చెప్పారు. కేంద్రీయ విద్యాలయాల నిర్మాణాన్ని ఏ ప్రాంతంలో చేయాలి, తాత్కాలికంగా ఎక్కడ పాఠశాల నిర్వహించాలి అనే విషయాలను జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలు పొందుపరచి కేంద్రానికి పంపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఇఓ సత్యనారాయణ, ఎంపిడిఓ ఎల్.జ్యోతి, ఎంఇఓ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పేట అభివృద్ధికి పెద్దపీట

నాయుడుపేట నగర పంచాయతీలో 2015–1016 సంవత్సరానికిగాను బడ్జెట్‌లో సూచించిన విధంగా, రూ. 3.50 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించేందుకు ఈ నెల 7న జరిగిన అత్యవసర సమావేశంలో పాలకమండలి సభ్యులు పాలనా పరమైన ఆమోదం తెలిపారు. ఈ సమావేశం నాయుడుపేట నగర పంచాయతీ ఛైర్మెన్ శోభారాణి అధ్యక్షత్వంలో జరిగింది. ఇందులో భాగంగా, విద్యుత్ పాతబకాయిలు చెల్లించేందుకు రూ.కోటి కేటాయించారు. ప్రజారోగ్య సిబ్బందిని రెగ్యులర్ చేసేందుకు రూ. 1.12 కోట్లు, ఒప్పంద సిబ్బంది జీతభత్యాల కోసం రూ. 24 లక్షలు కేటాయించారు. 1956 నుంచి 2006 వరకు వున్న పాత మొండిబకాయిలను రూ. 43.96 లక్షలు రద్దు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. బకాయిదారులు పట్టణంలో లేకపోవడం లేదా మరణించడం వంటి కారణాలతో ఆ బకాయిలను రద్దు చేయాలని నిర్ణయించారు. ప్రతి కౌన్సిలర్ ఒక వార్డును దత్తతగా తీసుకుని అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ వైస్‌ఛైర్మెన్ ఎ.సుబ్రహ్మణ్యం, కమిషనర్ ఎ.ప్రసాద్‌లు పాల్గొన్నారు.

# ఏఎన్‌యూ-ఇస్రోల మధ్య అవగాహన

శాటిలైట్ డేటా ఎనాలసిస్ అంశాల్లో సంయుక్తంగా చర్యలు చేపట్టేందుకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల, బెంగుళూరు ఇస్రో సంస్థల మధ్య ఎంవోయూ(అవగాహన ఒప్పందం) కుదిరింది. యూనివర్శిటీ డైక్‌మెన్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఇస్రో డైరెక్టర్ డాక్టర్ డివిఏ రాఘవమూర్తి, ఆచార్య నాగార్జున యూనివర్శిటి రిజిస్ట్రార్ ఆచార్య పి.రాజశేఖర్‌లు ఒప్పందపత్రాలను మార్చుకొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విసి ఆచార్య కె.వియ్యన్నారావు మాట్లాడుతూ శాటిలైట్ డేటా ఎనాలసిస్ సెంటర్ ద్వారా ప్రభుత్వానికి, సమాజానికి కావలసిన సేవలను అందించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. ఇస్రో డైరెక్టర్ డాక్టర్ రాఘవమూర్తి మాట్లాడుతూ మానవాళి మనుగడకు సమాజ, ప్రభుత్వపరమైన అంశాల సమాచారాన్ని సేకరించేందుకు శాటిలైట్‌లు ప్రధానంగా దోహదం చేస్తాయన్నారు. శాటిలైట్‌ల నుంచి సహజవనరుల వినియోగం, మౌలిక వసతుల అభివృద్ధి, పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వైపరీత్యాల నివారణ, ఈ గవర్నెన్స్, డిజిటల్ మానిటరింగ్ తదితర అంశాలకు సంబంధించిన డేటాను ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన శాటిలైట్ డేటా ఎనాలసిస్ అండ్ అప్లికేషన్ సెంటర్‌కు అందించేందుకు కావాల్సిన సాఫ్ట్‌వేర్‌ను ఏఎన్‌యూకి ఇచ్చామన్నారు. శాటిలైట్‌ల నుంచి ఛాయాచిత్రాలను కూడా ఏఎన్‌యూ సెంటర్‌కు ఇచ్చే అధునాతన పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు.

## కలిగిరి సిఐగా సాంబశివరావు


కలిగిరి సిఐగా పి.సాంబశివరావు నియమితులయ్యారు. గుంటూరు రేంజ్ కార్యాలయం నుంచి ఇక్కడ నియమితులైన ఆయన, ఈనెల 6న కలిగిరిలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సిఐగా వున్న సుబ్బారావు బదిలీ కావడం, ఆయన స్థానంలో వున్న రాజశేఖర్ కూడా బదిలీ కావడంతో, సుమారు రెండున్నర నెలల తర్వాత సిఐ స్థానాన్ని సాంబశివరావు నియామకంతో భర్తీ చేశారు.

## రెడ్డి సత్తా జిల్లా అధ్యక్షుడిగా వల్లూరి

రెడ్డి సత్తా నెల్లూరుజిల్లా అధ్యక్షుడిగా ఆత్మకూరు మండలంలోని వెంకట్రావు పల్లికి చెందిన వల్లూరి వెంకటేశ్వర్లురెడ్డిని నియమించినట్లు ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు 7వ తేదీ తెలిపారు.

# మహిళలు హక్కుల కోసం ఉద్యమించాలి

నెల్లూరుజిల్లా అల్లూరు మండలం సింగపేట గ్రామంలోని గిరిజన కాలనీలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మాట్లాడుతూ సమాజంలో 75శాతం మంది దళిత, గిరిజన, ఇతర బడుగు వర్గాలకు చెందిన మహిళలు అణచివేతకు గురౌతున్నారన్నారు. ఈ సందర్భంగా బాపట్ల సత్యవతమ్మను సత్కరించారు. దళిత నాయకులు జరుగుమల్లి విజయరత్నం, జె.పెద్దరాయుడు తదితర మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఈ మానవతా దీపం ఎప్పటికీ ఆరిపోదు

- **తాను జీవన్మృతుడైనా.. నలుగురికి పునర్జన్మనిచ్చిన మణికంఠ**
- **వెలుగులు నింపిన.. అవయవాల దానం**

*ఏ జీవితానికైనా సార్థకత అంటూ ఏమైనా వుందా?.. ఉంటే, అది జీవించినపుడే కాదు, మరణించినా కూడా జీవించినపుడే మానవ జన్మకు నిజమైన సార్థకత!.. అని రుజువు చేసే సంఘటన ఇది. మనం భౌతికంగా లేకున్నా, మనం చేసే మంచిపనులకు మాత్రం మరణం వుండదు.. అని నిరూపించే అరుదైన.. అపురూపమైన ఘటన ఇది.*

మణికంఠ.. అనే పేరు నేడు మానవీయతకు చిరునామాగా మారిందంటే, తనకు బ్రెయిన్ డెడ్ అయినా, తన దేహంలోని అవయవాలతో మరికొంతమందికి వెలుగుబాటలు పరచినందువల్లనే. తాను జీవన్ముతుడు అయినప్పటికీ, మరణశయ్యపై వున్న మరింతమంది జీవితాలను తన అవయవాల దానంతో చిగురింపజేసి చిరంజీవి అయ్యాడు. తద్వారా, తానూ వారిలో తిరిగి చిగురించాడు. మానవతా పరిమళాలను లోకమంతా చాటాడు. గుంటూరు జిల్లాలోని మంగళగిరి వద్ద వున్న ఎన్ఆర్ఐ ఆసుపత్రి అందుకు వేదికైంది.

ఈ నెల 6న జరిగిన ఈ సంఘటన వివరాలిలా వున్నాయి. విజయవాడ సమీపంలోని రామవరప్పాడు గ్రామంలో ఒక పేద కుటుంబానికి చెందిన మణికంఠ(22) కారుడ్రైవర్‌గా పనిచేసేవాడు. కొంతకాలం క్రితం తండ్రి అనారోగ్యంతో చనిపోగా, తల్లి లేవలేని స్థితిలో వుంది. ఈ పరిస్థితుల్లో కుటుంబాన్ని పోషించుకునేందుకు మణికంఠ కారుడ్రైవర్‌గా పనిచేసేవాడు. కాగా, ఈనెల 3న విజయవాడలో జరిగిన కారు ప్రమాదంలో మణికంఠ తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయం తగలడంతో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అతనిని చికిత్సకు చేర్చారు. అయితే, మణికంఠ బ్రైన్ డెత్‌కి గురైనటు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. దీంతో, మణికంఠ కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఆ బాధను ఎలాగో తట్టుకుంటూనే, సమాజానికి సేవ చేయాలనే మణికంఠ ఆశయాలను నెరవేర్చేందుకు మణికంఠ సోదరి శివనాగజ్యోతి సంకల్పించింది. అతని అవయవాలను దానం చేసి, తద్వారా మరింతమంది జీవితాలకు వెలుగు తేవాలని ఆమె కుటుంబసభ్యులను ఒప్పించి, వైద్యులకు తమ నిర్ణయం తెలియజేశారు. దీంతో, వైద్యులు వెంటనే స్పందించారు. ఈ విషయాన్ని విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి రవిరాజు దృష్టికి తీసుకురావడం, ఆయన స్పందించి చెన్నైలోని జీవనధార ట్రస్టు వారితో సంప్రదించడం, ఆ తర్వాత మణికంఠ అవయవాలను వేరు చేసి తీసుకునేందుకు చెన్నైలోని ఫోర్టిస్ ఆసుపత్రి వారు ముందుకు రావడం చకచకా జరిగిపోయాయి. స్వీకరించిన ఆ అవయవాలను అవసరమైనవారికి అమర్చడం ద్వారానే అవయవ మార్పిడికి సార్థకత చేకూరుతుందని భావించిన వైద్యులు, పోలీసులు అందరూ సంయుక్తంగా కృషి చేసి, ఆ అవయవాలను సరైన సమయంలో అవసరమైనవారికి అమర్చి, వారికి పునరుజ్జీవితం కల్పించేందుకు తగు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో, తొలుత మణికంఠ శరీరం నుంచి వేరుచేసిన శరీర భాగాలను ఎన్నారై ఆసుపత్రి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో గన్నవరం విమానాశ్రయానికి తరలిస్తుండగా, ఆసుపత్రి ఆవరణంలో మణికంఠ బంధువులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి.. కరతాళ ధ్వనులు చేస్తూ మణికంఠ మానవత్వాన్ని తమ హర్షాతిరేకాలతో అభినందించారు. అవయవాలను అత్యవసరంగా తరలించేందుకు వీలుగా ఆ సమయంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిపేశారు. అక్కడ నుంచి చెన్నైలోని ఫోర్టిస్ ఆసుపత్రికి, హైదరాబాద్‌లోని గ్లోబల్ ఆసుపత్రికి ప్రత్యేక విమానాల్లో ఆ అవయవాలను తీసుకువెళ్ళి, అవసరమైనవారికి అమర్చేందుకు శరవేగంగా ఏర్పాట్లు చేశారు.

చెన్నైలోని ఫోర్టిస్ ఆసుపత్రిలో ఒక రోగికి అమర్చేందుకు గుండె, ఊపిరితిత్తులను తీసుకువెళ్ళగా, కాలేయాన్ని హైదరాబాద్ గ్లోబల్ ఆసుపత్రికి తరలించారు. మంగళగిరిలోని ఎన్నారై ఆసుపత్రిలో ఒక రోగికి ఒక మూత్రపిండాన్ని, గుంటూరులోని ఆసుపత్రిలో వున్న మరో రోగికి ఇంకో మూత్రపిండాన్ని అమర్చారు. గుంటూరు వద్ద వున్న శంకరనేత్రాలయానికి కళ్ళను దానం చేశారు. తమ తమ్ముడి ఆశయ సాధన కోసమే అవయవ దానానికి సంకల్పించామని, తద్వారా నలుగురికి పునరుజ్జీవం కలిగిందని, తమ తమ్ముడిని వారిలో చూసుకుంటామని మణికంఠ సోదరి శివనాగజ్యోతి పేర్కొంది. కాగా, మణికంఠ నుంచి సేకరించిన కాలేయంతో హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన ఓ వ్యక్తికి పునర్జన్మ లభించడం ఎంతో అపురూపమైన విషయం. ఆ రోగికి కాలేయం మార్పిడి చికిత్సను గ్లోబల్ ఆసుపత్రి వైద్యులు దిగ్విజయంగా నిర్వహించారు.

ఇలా.. తాను జీవన్ముతుడైనప్పటికీ, తన అవయవాల దానంతో మరికొంతమంది జీవితాల్లో వెలుగు నింపిన మణికంఠ..నిజంగా మానవతకు మణిహారమే!..మానవత్వానికి మకుటాయమానమే!.

## పరమహంస పరివ్రాజకులు త్రిదండి చిన్నజియ్యర్ స్వామి ఆధ్వర్యంలో

# "శ్రీమద్రామానుజ స్ఫూర్తి కేంద్రం"

### - నెల్లూరులోని వి.పి.ఆర్ ఇంట్లో చినజియర్‌స్వామి వెల్లడి






అతి సామాన్యుడికి సైతం ఆలయ ప్రవేశం కలిగేలా చేసి సాక్షాత్తూ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆరాధనా విధానాన్ని క్రమబద్ధీకరించి నిత్యం లక్షలాది భక్తులు ఆ కలియుగ ప్రత్యక్ష దైవాన్ని దర్శించుకునేలా చేసిన సమతామూర్తి "శ్రీ రామానుజచార్య" ప్రాభవాన్ని ప్రపంచ వ్యాప్తంగా తెలియజేయడంతో పాటుగా ఆయనను భావితరాల వారికి పరిచయం చేయాలనే సత్సంకల్పంతో సుమారు 600కోట్ల రూపాయలతో 'శ్రీమద్రామానుజ స్ఫూర్తి కేంద్రం' హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో నిర్మించనున్నట్లు చిన్న జియ్యర్ స్వామి నెల్లూరులో ప్రకటించారు.

మార్చి 6వ తేదీ శుక్రవారం నెల్లూరుకు విచ్చేసిన చినజియర్‌స్వామి మాగుంట లేఅవుట్‌లోని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంటికి విచ్చేశారు. దాదాపు రెండు గంటలపాటు విపిఆర్ ఇంట్లో భక్తులకు తన దివ్య ఆశీస్సులు అందించిన స్వామి శ్రీరామానుజ స్ఫూర్తికేంద్రం గురించి భక్తులకు వివరించారు. రామానుజులు వారి 1000వ జన్మదినం సందర్భంగా చేపట్టిన ఈ మహత్కార్యం యొక్క ఘనతను సుమారు లక్షమందికి తెలియజేసి వారిని ఈ నిర్మాణంలో భాగస్వామ్యులుగా చేయాలన్నది తమ లక్ష్యంగా చెప్పారు.

216 అడుగుల ఎత్తులో రూపొందించనున్న శ్రీరామానుజ మహావిగ్రహంతో పాటు అదే ప్రాంగణంలో 108 సుప్రసిద్ధ వైష్ణదేవాలయాలు ఒక చోట వుండేలా ఏర్పాట్లు చేస్తు న్నట్లు స్వామి చెప్పారు. భారతదేశంలో అతి ఎత్తైన విగ్రహం ఏదీ అని పరిశోధకులు పరిశీలించినప్పుడు ఈ మహోన్నతమైన విగ్రహం వారికి కనిపించాలని, ప్రపంచ వ్యాప్తంగా వున్న భావితరాల యువత ఈ విగ్రహాన్ని చూసినప్పుడు రామానుజాచార్యుల వారి గొప్ప తనం తెలుసుకోవాలనే ఆసక్తి కలగాలని ఆయన అన్నారు. ఢిల్లీలో ప్రపంప ప్రఖ్యాతి గాంచిన అక్షర ధామ్ తరహాలో ఈ నిర్మాణం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒక నెల ఆదాయం లేదా ఖర్చును ప్రతి ఒక్కరూ ఈ గొప్ప కార్యక్రమానికి వెచ్చించాలని పిలుపునిచ్చారు.


**విపిఆర్ ఇంట్లో భక్తుల సందడి**

మార్చి 6వ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంటికి విచ్చేసిన చినజియర్ స్వామి వారు దాదాపు రెండు గంటల పాటు విపిఆర్ ఇంట్లో వున్నారు. ముందుగా విపిఆర్ కుటుంబసభ్యులచే పాదపూజను అందుకుని అనంతరం భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. సిరులు, సంపదలు తాత్కాలికమని, మనం చేసే మంచి పనులు భావితరాలకు స్ఫూర్తినివ్వడమే కాకుండా మన పేరును చిరకాలం వుండేలా చేస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో విపిఆర్ కుటుంబ సభ్యులు, సమీప బంధువులు స్వామివారి భక్తులు విశేషంగా పాల్గొన్నారు. నెల్లూరు మాజీరూరల్ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి స్వామివారి ఆశీస్సులు పొంది శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పక్షాన స్వామిని సత్కరించారు. నెల్లూరు నగర మాజీశాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమారెడ్డి శ్యాంసుందరరెడ్డితో పాటు పలువురు ప్రము ఖులు స్వామివారిని సందర్శించి ఆశీస్సులు అందుకున్నారు. జై శ్రీమన్నారాయణ!.







ప్రతిభకు సత్కారం



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన విశ్వసాయి విద్యార్థి
చి॥ రిషిత (ఇంటర్మీడియట్ 989/1000)కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
గౌ॥ శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారు ప్రతిభ అవార్డునిచ్చి సత్కరించారు.

గమనిక: విశ్వసాయి కాలేజ్ పేరు,
నిర్వహించే బ్యాచ్‌ల పేర్లు (JOI, DIRECTORS BATCH)
ట్రేడ్ మార్క్ యాక్ట్ 1999 (సెక్షన్ 18 (1, రూల్ 25(2))
ప్రకారం రిజిష్టర్ చేయబడినవి.

ప్రతి ఆదివారం సెలవు !
ఆ సెలవు విశ్వసాయిలో మీ పిల్లల దిశానిర్దేశానికి నెలవు !!
సరైన సమయంలో మీరు తీసుకొనే నిర్ణయం... మీ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుంది.

Students of 9th & 10th Classes,
Jr. Intermediate, Sr. Intermediate
and their parents can interact with...

Directors of VISWASAI
Faculty members of VISWASAI
Former students of VISWASAI

Time | Every Sunday 9 am to 1 pm & 4 pm to 8 pm
Venue | VISWASAI JUNIOR COLLEGE, Magunta Layout, Nellore
Phone | 0861-2346003, 8886770470, 9160670002/03/04
Website | www.viswasai.com

MPC JOI PROGRAMME (IIT-JEE)
BiPC Directors Batches

Dr.N.Satyanarayana & G.Krishna Mohan's
VISWASAI JUNIOR COLLEGE
NELLORE

Eye Ads Pvt.Ltd.

# 'ప్రభా'తం

జమ్ము-కాశ్మీర్‌లో కరడుగట్టిన వేర్పాటువాది మసరత్ ఆలంను ఇటీవల విడుదల చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విపక్షాలు ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి కూడా. జమ్ము-కాశ్మీర్‌లో కొత్తగా ఏర్పడిన పిడిపి-బిజెపి కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చి పట్టుమని పదిరోజులు కూడా కాకముందే, అక్కడి ముఖ్యమంత్రి ముఫ్తీ మహమ్మద్ సయీద్ హటాత్తుగా ఇలాంటి చర్య తీసుకోవడం సర్వత్రా దిగ్భ్రాంతికి గురిచేసింది. గత నాలుగేళ్ళుగా జైల్లో వుంటున్న కాశ్మీర్ వేర్పాటువాద నాయకుడు వున్నట్లుండి విడుదల కావడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. వేర్పాటువాది అయిన మసరత్‌పై అనేక కేసులున్నాయని, అందులోనూ పాక్‌కు అనుకూలశక్తిగా వున్న ఈ వ్యక్తిని విడుదల చేయడం వేర్పాటువాదానికి ఊత మివ్వడమేనని విమర్శలు సర్వత్రా వెల్లువెత్తాయి. ఒక్క మసరత్‌నే కాదు, మరింతమంది వేర్పాటువాదుల విడుదలకు కూడా ముఫ్తీ చొరవ తీసుకుంటున్నారనే ఆరోపణలూ వెల్లుబికాయి. మొత్తమ్మీద ఈ అంశం సంకీర్ణప్రభుత్వంలోని బిజెపికి మరింత శిరోభారంగా మారింది. మసరత్ విడుదలపై ఎన్డీఏ ప్రభుత్వం కూడా విమర్శలపాలైంది. కాశ్మీర్‌లో పిడిపి-బిజెపి కూటమి సంకీర్ణప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, పాలనకు ఉపక్రమిస్తున్న ఈ ప్రారంభదశలోనే ఇలాంటి అవాంతరం రావడం విచారకరం. అందులోనూ జాతీయవాదానికి ప్రాధాన్యత ఇచ్చే బిజెపికి మసరత్ విడుదల కావడం ఏమాత్రం మింగుడుపడడం లేదు. ఇప్పుడు కాదు, ఇక్కడ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజునే ముఖ్యమంత్రిగా ముఫ్తీమహమ్మద్ సయీద్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే, ఇక్కడ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పాకిస్తాన్, కాశ్మీర్‌లోని మిలిటెంట్ల సహకారం కారణమనే భావనతో వారికి కృతజ్ఞతలు చెప్పినప్పుడే, ఈ కూటమి భవిత ఎలా వుంటుందోననే ఆందోళన అందరిలోనూ కనిపించింది. ఇక్కడ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించింది మన ఎన్నికల సంఘం అని అందరికీ తెలిసిందే. అందుకు వెన్నుదన్నుగా నిలచింది సైన్యం..అన్నిటికీ మించి ప్రజలంతా సంఘటితంగా వుండి ఎన్నికల్లో పాల్గొనడం..ఇవీ అసలైన కారణాలు. అయితే, వాటన్నిటినీ తోసిరాజని పాక్‌కు, ఉగ్రవాదులకు, వేర్పాటువాదులకు కృతజ్ఞతలు చెప్పినప్పుడే ముఫ్తీ మనస్తత్వం ఏమిటో తేలిపోయింది. ఈ నేపథ్యంలో ఇక ఎప్పుడు ఏమవుతుందోనని అందరూ ఆందోళనగా వుంటున్న సమయంలోనే, ఇదిగో ఇప్పుడు వేర్పాటువాదులను విడుదల చేయాలనే ఈ విపరీత ధోరణి వచ్చిపడింది. వేర్పాటువాద నాయకుడు మసరత్ విడుదలకు చొరవ చూపడమే కాక, ఏళ్ళ తరబడి జైళ్ళలో వున్న మరింతమంది వేర్పాటువాదులను, మిలిటెంట్లను కూడా ముఫ్తీ ప్రభుత్వం విడుదల చేయాలనే ఆలోచనలు చేస్తోందనే భావనలు వ్యాప్తి చెందడంతో, ఇలాంటి దుందుడుకు చర్యలపట్ల సర్వత్రా వ్యతిరేకత వస్తోంది. కాశ్మీర్‌లో శాంతిస్థాపన కోసం అందరినీ కలుపుకుపోవాలన్న కనీస ఉమ్మడి కార్యక్రమం మేరకే మసరత్‌ను విడుదల చేశామని ముఫ్తీ ప్రభుత్వం సమర్థింపు వాదనలను ఔననలేం. అదేవిధంగా, మసరత్ విడుదలకు సంబంధించిన ప్రక్రియ అంతా గవర్నర్ పాలన వున్న రోజుల్లోనే ప్రారంభమైందని, కేంద్రాన్ని సంప్రదించిన తర్వాతనే ఇలాంటి నిర్ణయం తీసుకుని వుంటారనే వాదనలనూ కాదనలేం. అయితే, ఎవరైనా సరే..ఇలాంటి ముఖ్యమైన అంశాల విషయంలో ఏకపక్షంగా ఆలోచించడం మాత్రం మంచిది కాదనే చెప్పాలి. అందరితోనూ చర్చించి ఆచితూచి అడుగులు వేయాలే తప్ప, చిత్తం వచ్చిన రీతిలో నిర్ణయాలు తీసుకోవడం వల్ల చివరికి అందరికీ నష్టదాయకమే అవుతుందని గుర్తించాలి. కారణాలేమైనా సరే, ఏ రకంగానూ వేర్పాటువాదానికి ఊతమిచ్చే చర్యలు ప్రమాదకరమేనని చెప్పక తప్పదు. అది వేర్పాటువాదమైనా, ఉగ్రవాదమైనా..అవి ఏ రూపంలో వున్నా..వాటి పట్ల ఎలాంటి అలక్ష్యం తగదు. వేర్పాటువాదానికి ఊతమిస్తే చివరికి అది ప్రమాదకరంగా మారి మనల్నే కాటేస్తుంది. మన నిప్పే కదా..అని జేబులో పెట్టుకుంటే..మన వళ్ళే కాలుతుంది..ముప్పును తీసుకొచ్చి గడపలో కూర్చోబెట్టుకుంటే మన కొంపే కొల్లేరవుతుంది. అందులోనూ, ఇప్పుడు కాశ్మీర్‌లో కనీస ఉమ్మడి కార్యక్రమం కింద పిడిపి-బిజెపి కూటమి ఏర్పడివుంది. అన్ని పక్షాలతో చర్చించి ప్రగతి కోసం సరైన నిర్ణయాలు తీసుకోవాల్సిన ఈ కీలకదశలో, ఇలాంటి అస్తవ్యస్త నిర్ణయాలతో పరిస్థితిని జటిలం చేసుకోవడం వల్ల.. మన దారిని మనమే కావాలని తప్పినట్లవుతుంది. మంచిదారి వదిలేసి పెడ దారి పట్టినట్లవుతుంది. అసలే అస్తవ్యస్త పరిస్థితుల్లో వున్న జమ్ము-కాశ్మీర్‌లో స్వేచ్ఛాయుత ఎన్నికలు జరిగాక, ఇన్నాళ్లకైనా తమ ఆకాంక్షలు తీర్చేవిధంగా ప్రభుత్వం వుంటుందని ఎంతో ఆశతో వున్న ప్రజలకు, ఇలాంటి దుందుడుకు చర్యలు మరింత ఆందోళనకరమే అవుతాయి. ఇదిలావుంటే, మసరత్ విడుదలపై తీవ్ర విమర్శలు వ్యక్తమైన నేపథ్యంలో, బిజెపి నుంచి పిడిపికి ఘాటైన హెచ్చరిక రావడం ప్రజలకు ఎంతో ఊరట కలిగించేదే. 'మిలిటెంట్లు, వేర్పాటువాదుల విడుదలపై ఏకపక్ష నిర్ణయాలు ఇక సహించం, అధికారం మాకెంతమాత్రం ముఖ్యం కాదు, దేశభద్రతే ప్రధానం'.. అంటూ పేర్కొనడం ఆహ్వానించదగ్గ పరిణామం. తాజాగా ప్రధాని నరేంద్రమోడీ సోమవారం పార్లమెంట్‌లో ఈ విషయం మాట్లాడడం, వేర్పాటువాది మసరత్ ఆలంను విడుదల చేయడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, దేశ సమగ్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ ధోరణిని సహించదని స్పష్టం చేయడం.. ప్రజలకు ఒక పెద్ద భరోసా అనే చెప్పాలి. దీంతో, ముఫ్తీ ప్రభుత్వం ఒక మెట్టు దిగి, ఇక 'విడుదలలు లేవు' అని స్పష్టం చేయడం కొసమెరుపు. ఏదేమైనా, దాదాపు రెండున్నర దశాబ్దాలపాటు ఉగ్రవాద పదఘట్టనల్లో నలిగిపోయిన రాష్ట్రాన్ని ప్రగతిమార్గం పట్టించి, కాశ్మీరాన్ని నయనానందకరంగా తీర్చిదిద్దే బాధ్యతను విస్మరించి అస్తవ్యస్త విధానాలు అవలంబించడం ఏ ప్రభుత్వానికైనా సరే.. మంచిది కాదు. ఇకనైనా, సంకీర్ణప్రభుత్వంలోని రెండు పార్టీల నేతలూ కలిసికట్టుగా పనిచేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. జమ్ము-కాశ్మీర్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా చేయడమే తక్షణ కర్తవ్యంగా గుర్తించి.. ప్రజలు కన్న కలలను సాకారం చేయాలి. ఆ దిశలో సంకీర్ణ ప్రభుత్వం సమిష్టిగా కృషి చేస్తుందని ఆశిద్దాం!...

## పెడమార్గం... ప్రమాదకరం




వేర్పాటువాదానికో, ఉగ్రవాదానికో ఊతమిస్తే చివరికి అది ప్రమాదకరంగా మారి మనల్నే కాటేస్తుంది. మన నిప్పే కదా.. అని జేబులో పెట్టుకుంటే.. మన వళ్లే కాలుతుంది.. ముప్పును తీసుకొచ్చి గడపలో కూర్చోబెట్టుకుంటే మన కొంపే కొల్లేరవుతుంది. అందుకే, ప్రభుత్వాలు ఎప్పుడూ పెడదారి పట్టకూడదు.. ఏకపక్ష నిర్ణయాలు కూడదు. జమ్ము-కాశ్మీర్ విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. అస్తవ్యస్త విధానాలతో సమస్యలను జటిలం చేయకుండా, ఇకనైనా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేదిశగా అక్కడి సంకీర్ణప్రభుత్వం కృషి చేస్తుందని ఆశిద్దాం!..

# దళారుల మాయమాటలు నమ్మవద్దు

### --- రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎం.డి రామ్‌గోపాల్ ---



జిల్లాలోని అధికశాతం మంది రైతులు ధాన్యం దళారులు చెప్పే మాయమాటలు విని మోసపోతున్నారని, ధాన్యం విక్రయాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎం.డి రామ్‌గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 6న ఆయన నెల్లూరులోని పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగులతో సమావేశమై రైతుల పరిస్థితులను సమీక్షించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని విక్రయించుకుంటే రవాణా ఛార్జీలు భారమైపోతాయనే అపోహతో అనేకమంది రైతులు మధ్యవర్తుల మాటలతో మోసపోయి, వారికి తక్కువ ధరలకు తమ ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని ఆయన అన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి, చెత్తాచెదారాలు లేకుండా శుభ్రం చేసుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే రైతులకు మద్దతు ధర లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన గోతాలను కూడా కొనుగోలు కేంద్రాల వద్ద ఇస్తారని ఆయన తెలిపారు. కృష్ణా, గోదావరి జిల్లాల రైతులు ఈ విధంగా చేసి లాభాల బాట నడుస్తుంటే, నెల్లూరు జిల్లాలో రైతులు రకరకాల అపోహలకు గురవుతున్నారని, ఆన్‌లైన్ ద్వారానే చెక్కుల రూపంలో రైతులకు మద్దతు ధరను చెల్లించి, ఆ ధరను కూడా నమోదు చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో 31 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సేకరించాల్సివుందన్నారు. పలు జిల్లాల్లో ఎఫ్‌సిఐ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నా, ఈ జిల్లాలో పౌరసరఫరాల సంస్థ అధికారులే ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. జిల్లాలో లెవీ సేకరణ లక్ష్యాలను సాధించాలని, అవసరమైతే పాత బియ్యాన్ని కూడా లెవీగా తీసుకోవాలని ఆయన సూచించారు. తూకాల్లో మోసాలను అరికట్టాలని, రైతులకు 48 గంటలలోగా ఆన్‌లైన్ ద్వారా మద్దతు ధర చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ కొండయ్య, డిఎస్ఓ సంధ్యారాణి తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# తొమ్మిది లక్షలు హాంఫట్!!

నెల్లూరుజిల్లా పొదలకూరు మండలంలోని తాటిపర్తి పంచాయితీలో తొమ్మిది లక్షల రూపాయలు హాంఫట్ అయినట్లు విచారణలో నిగ్గు తేల్చిన అధికారులు అప్పటి పంచాయితీ కార్యదర్శి మయూరిని సస్పెండ్ చేశారు. మయూరి ప్రస్తుతం దేగపూడి పంచాయితీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆమె సస్పెండ్ కావడంతో దేగపూడి ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా ఇనుకుర్తి కార్యదర్శి కృష్ణవేణిని ఎంపిడిఓ సిహెచ్ శ్రీహరి నియమించారు. కార్యదర్శి సస్పెన్షన్ ఉత్తర్వులు ఈ నెల 2వ తేదీన ఎంపిడిఓ కార్యాలయానికి అందినట్లు నెల్లూరు డిఎల్‌పిఓ శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేకాధికారుల పాలనలో మయూరిని తాటిపర్తి పంచాయితీకి ఇన్‌ఛార్జిగా నియమించారు. పంచాయితీ నిధుల ఖర్చు, జమ విషయంలో ఆమె రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని విమర్శలు ఎదుర్కొన్నారు.




## మత ద్వేషం - పరిణామాలు

ప్రపంచమంతా నాగరికత వెల్లివిరుస్తున్నప్పటికీ ప్రస్తుత ఎలక్ట్రానిక్ యుగంలో కూడా పరమతద్వేషాలు బహిర్గతమవుతుండడం శోచనీయం. దేవతలు, దెయ్యాలు, మతమూ శాశ్వత కాల విశ్వాసాలు. మానవ జీవితంలో ఇవి ప్రముఖపాత్ర వహిస్తాయి. ఆదిశంకరులు చెప్పినట్లు ఈ లోకంలో 'మాయ' మానవులను అనేక రకాలుగా ప్రభావితం చేస్తుంది. ఐరోపా జ్యోతిష్కుడు నోస్ట్రడామస్ చెప్పినట్లు మానవులందరూ కలిసిమెలిసి ఉండలేరు. జాతులు, మతాల వలన మానవలోకం విధ్వంసానికి గురవుతుంది. ఇది వాస్తవం. కొన్ని మతాలవారు తమదే గొప్పదైనట్లు అనేక దేశాలలో రక్తపాతం సృష్టిస్తున్నారు. మానవ హక్కులకు భంగం కలిగిస్తున్నారు. కొన్ని దేశాలలో కొన్ని మతాలను అవమానిస్తున్నారు. కాబట్టి ప్రతి దేశంలో కూడా మైనార్టీల హక్కులను కాపాడడానికి ఒక మతాతీత మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి.

– పెండేల రాజశేఖర్, నెల్లూరు.

## పవన్ పరువుపోయింది

చిరంజీవిలాగే పవన్ కల్యాణ్ కూడా అన్‌పాపులర్ అవుతున్నారు. రాజకీయాలలోకి పూర్తిగా రాకుండా ఉండాల్సింది. లేదంటే పూర్తిగానన్నా వచ్చుండాలి. రాజధాని ప్రాంతంలో పర్యటించినరోజు రైతులకు అనుకూలంగా మాట్లాడాడు. రైతుల తరఫున నిరాహారదీక్ష చేస్తానన్నాడు. ప్రభుత్వంపై ధ్వజమెత్తాడు. పక్కరోజే మాట మార్చాడు. రైతులకు ఇస్తున్న ప్యాకేజీ బాగుందంటూ చంద్రబాబును వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేసాడు. ఇలా రెండు రకాలుగా మాట్లాడితేనే ఎందుకూ పనికిరాకుండాపోతారు.


ఎస్.నాగసాయి, కనిగిరి.

## 'ఇండియా' నిలిచిపోయింది

కొన్ని పత్రికలు ప్రజలకు ఉచ్ఛ్వాసనిశ్వాసాలు. దేశంలో అత్యంత ప్రాచుర్యం పొంది పాతికేళ్లుగా పాఠకులను అలరిస్తున్న 'ఇండియాటుడే' తెలుగు ఎడిషన్ ఆగిపోవడం విచారకరం. ప్రపంచ వ్యాప్తంగా వున్న పత్రిక. దేశంలో మారిన వైపరీత్యాలతో పత్రికలను నడపడం కష్టతరంగా మారింది. పత్రికల మనుగడ ఆగిపోతే ప్రజాస్వామ్యానికే చేటు కలుగుతుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

# ఎమ్మెల్సీ ఆశల్లో కమలపుత్రులు


భారతీయ జనతాపార్టీకి మూడున్నర దశాబ్దాల చరిత్ర ఉంది. దేశంలోని చాలా రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రతిపక్షంలోనూ ఉండింది. ఆ రాష్ట్రాల్లో ఈ పార్టీ నాయకులు, కార్యకర్తలను గురించి పెద్దగా చెప్పుకోవాల్సిన పనిలేదు. కాని ఆంధ్రప్రదేశ్‌లో మూడున్నర దశాబ్దాల నుండి ఇదే పార్టీలో ఉంటూ ఈ పార్టీ సిద్ధాంతాలనే నమ్ముకుని, ఈ పార్టీ జెండానే విడవకుండా మోస్తున్న ఆ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఎంతైనా మెచ్చుకుని తీరాలి. ఎందుకంటే ఈ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది లేదు. కనీసం ప్రధాన ప్రతిపక్షంగా ఉండింది కూడా లేదు. కాబట్టి నాయకులకు, కార్యకర్తలకు పార్టీ పదవులే తప్ప అధికారికంగా అనుభవించే పదవులేమీ ఉండవు. అధికారంలోకి రాకుంటే మరుక్షణమే అధికారపార్టీలోకి జంప్ చేసే రాజకీయ సంస్కృతి బలంగా ఉన్న ఈ కాలంలో ఎన్నో ఏళ్ళుగా బీజేపీనే అంటిపెట్టుకున్న నాయకులను, కార్యకర్తలను ఎంతైనా అభినందించాల్సిందే! అలాంటి నాయకులు కార్యకర్తలు మన నెల్లూరుజిల్లాలో కూడా ఉన్నారు. వీరంతా విద్యార్థి దశలో ఏబీవీపీతో అడుగువేసి, సంఘ్‌తో సంబంధాలు పెంచుకుని, జనసంఘ్‌తో రాజకీయాలలోకి అడుగుపెట్టి, జనసంఘ్ నుండి భారతీయ జనతాపార్టీగా రూపాంతరం చెందిన బీజేపీతో సుదీర్ఘ ప్రయాణాన్ని సాగిస్తున్న నాయకులే! మన జిల్లాలోనూ ఇలాంటి నేతలు వున్నారు.

రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీల సంకీర్ణ ప్రభుత్వం కొనసాగుతున్న నేపథ్యంలో బీజేపీ నాయకులలోనూ పదవుల ఆశలు, ఊసులు మొలకెత్తాయి. ముఖ్యంగా త్వరలో శాసనమండలి సభ్యుల పదవులను భర్తీ చేయనున్నారు. జిల్లాకు రెండు ఎమ్మెల్సీలను కేటాయించవచ్చని ప్రచారం జరుగుతుంది. ఖచ్చితంగా ఒకటి తెలుగుదేశం నాయకులకే పోతుంది. రెండోదాని కోసం తెలుగుదేశం నాయకులతో పాటు బీజేపీ నాయకులు కూడా పోటీ పడుతున్నారు. ముఖ్యంగా జిల్లాకుచెందిన బీజేపీ జాతీయ నాయకులు, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు చొరవ చూపిస్తే జిల్లాకు చెందిన బీజేపీ నాయకులకు ఎమ్మెల్సీ దక్కడం పెద్ద కష్టమేమీ కాదు. ఎమ్మెల్సీ రేసులో జిల్లా బీజేపీ నుండి సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డిలు ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది.

సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి ఏబీవీపిలో విద్యార్థి దశ నుండే ఉన్నాడు. పార్టీలో పలు పదవులు నిర్వహించాడు. జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఉన్నారు. 2004లో నెల్లూరు అసెంబ్లీ నుండి పోటీచేసి పరాజయం పాలయ్యారు. 2014ఎన్నికల్లో నెల్లూరు గ్రామీణ శాసనసభ నుండి పోటీచేసి ఓడిపోయారు. ఇప్పుడు ఎమ్మెల్సీ కోసం తన పంథాలో గట్టిగా పోరాడుతున్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వున్న కర్నాటి ఆంజనేయరెడ్డి కూడా ఎమ్మెల్సీ కోసం గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆంజనేయరెడ్డి కూడా బీజేపీకి అంకితమైన నాయకుడు. 1989అసెంబ్లీ ఎన్నికల్లో ఆత్మకూరు నుండి పోటీ చేసి కొమ్ములు తిరిగిన కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ బి.సుందరరామిరెడ్డిని ఓడించినంత పని చేసి కొద్ది తేడాతో ఓడిపోయాడు. పార్టీ జిల్లా అధ్యక్షపదవితో పాటు పార్టీలో పలు పదవులు చేపట్టాడు. 2009 ఎన్నికల్లో నెల్లూరురూరల్ నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీని విడవకుండా జెండాను మోస్తున్నాడు.

బీజేపీ సీనియర్‌లలో చెప్పుకోదగ్గ నాయకుడు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి. అటు బీజేపీకి విధేయుడిగా కట్టుబడడంతో పాటు ఇటు జిల్లాలో వెంకయ్యనాయుడుకు నమ్మిన బంటుగా ఉంటున్నారు. పార్టీలో గాని, బయట గాని విభేదాలు లేని వ్యక్తి. అటు రాజకీయ నాయకుడిగా, ఇటు రైతు నాయకుడిగా జిల్లాలో అందరికీ సుపరిచితుడు. ఏబీవీపి జిల్లా కార్యదర్శిగా, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా పలు పదవులు నిర్వహించారు. 1982 నుండి 88వరకు వైపాడు సర్పంచ్‌గా, ఆ తర్వాత ఇందుకూరుపేట సమితి ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. 2001లో జిల్లా నుండి ఎంపికైన బీజేపీ ఎంపిపి ఆయనే కావడం గమనార్హం. ఇందుకూరుపేట ఎంపిపిగా ఆయన పని చేశారు. కేంద్రంలో ఎన్డీఏ అధికారంలో వున్నప్పుడు 2001 నుండి 2003 వరకు వెంకయ్యనాయుడు ఆశీస్సులతో భారత ఆహారసంస్థ డైరెక్టర్‌గా రైతాంగానికి సేవలందించారు. 1994లో ఆత్మ కూరు అసెంబ్లీ నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా, 2007లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాయలసీమ తూర్పు పట్టభద్రుల నియోజకవర్గం నుండి, 2009లో నెల్లూరు లోక్‌సభ నుండి పోటీ చేసి ఓడిపోయారు. ఇక జిల్లాలో ఆక్వాఫీల్డ్ అంటే గుర్తుకొచ్చేది రాధాకృష్ణారెడ్డే! జిల్లాలో ఆక్వా పరిశ్రమకు మూలస్తంభాలలో ఆయనొకరు. వెంకయ్యతో ఏబీవీపి దశ నుండి సత్సంబంధాలు కలిగి వుండడంతో ఆయన ద్వారానే ఎమ్మెల్సీ ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఎమ్మెల్సీ కోసమే కాకుండా జిల్లాలో పలు దేవస్థానాల కమిటీలు, ఇతర నామినేటెడ్ పదవుల కోసం కూడా బీజేపీ నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తుండడం విశేషం.

## గ్రామీణ ప్రజలకు చేరువగా

# 'గ్లోబల్' వైద్యం



పెద్ద పెద్ద నగరాల్లో మాత్రమే అందుబాటులో వుండే వైద్యసేవలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా అందుబాటులో వుంచేందుకు కృషి చేస్తున్నామని, ఈ నేపథ్యంలో చెన్నై, హైదరాబాద్‌లోని గ్లోబల్ వైద్యశాల నిపుణులతో ఇక్కడి స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ఈ నెల 7న ఆయన వెంకటాచలం మండలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ కాలేయం, మూత్రకోశ, జీర్ణకోశం, పాంక్రియాస్ వంటి వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అంతేకాక, స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా అదనంగా ఉచిత కంటి పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ వ్యాధులతో బాధలు పడుతున్నవారికి ఉచితంగా ఎండోస్కోపి, స్కానింగ్ పరీక్షలు, రక్తపరీక్షలను జరిపి, మందులను, వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేలా, ప్రజలకు అవసరమైన అవగాహన కలిగించేందుకు కూడా తగు చర్యలు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. మంచినీటి కాలుష్యం కారణంగా అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని, మంచినీటిని వేడిచేసి తాగడం, లేదా శుద్ధి చేసుకోవడం ద్వారా పలురకాల వ్యాధులకు దూరంగా వుండవచ్చని ఆయన సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు తినడం ఆరోగ్యానికి ఎంతైనా మంచిదన్నారు. మితాహారం స్వీకరించాలని, ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, అందువల్ల మధుమేహం, ఊబకాయం వంటి అనారోగ్యాలకు దూరంగా వుండవచ్చని, 10వేల మంది జనాభాకు 20 మంది వైద్యులు అవసరమై వుండగా, ఇప్పుడు మనదేశంలో ఆ నిష్పత్తిలో కేవలం ఏడుగురే వున్నారని, అదేవిధంగా ప్రతి వైద్యశాలలో పడకలు, నర్సుల సంఖ్య తక్కువగా వుందని, ఆ సంఖ్యను మరింతగా పెంచాలని ఆయన సూచించారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం సంజీవని లాంటిదని, గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్య సౌకర్యం మెరుగుపరచాలనే సదాశయంతో ప్రధాని ఈ పథకం ప్రవేశపెట్టారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ ఒక ఉద్యమంలా చేస్తుండడం ఎంతో సంతోషకరమన్నారు. పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఎంతో తృప్తి వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ వైద్యశాల ఛైర్మెన్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, వైద్యనిపుణులు శ్రీనివాసన్, దినేష్‌జ్యోతిమణి, చంద్రశేఖర్, సెజియాన్, ఉమాశంకర్, రామశంకర్‌లతో పాటు, నెల్లూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షులు సురేంద్రరెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ సంచాలకులు కోటేశ్వరరావు, స్థానిక బిజెపి నాయకులు మురళి, జనార్ధన్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.


ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
**అమ్మ ఫర్నిచర్ మాల్**
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# తెలుగుతమ్ముళ్ళకు నిరాశ

***రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నెల్లూరు పర్యటన జిల్లా తెలుగుదేశం నాయకులకు నిరాశనే మిగిల్చింది. చంద్రబాబు వచ్చిన దానివల్ల జిల్లాకేదో ఒరుగుతుందని సామాన్య ప్రజలు ఆశపడలేదు. కాబట్టి వాళ్లది సమస్య కాదు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది కాబట్టి, పదేళ్ల నుండి పార్టీని నమ్ముకున్న తమకు ఏదన్నా న్యాయం జరుగుతుందని ఆశపడుతున్న నాయకులకే నిరాశ మిగిలింది. చంద్రబాబు పర్యటనలో నామినేటెడ్ పదవుల ప్రస్తావనే రాకపోవడం పదవుల ఆశావహుల్లో అసంతృప్తిని మిగిల్చింది.***

పార్టీ అధికారంలోకి వచ్చి 9నెలలు కావస్తున్నా ఇంతవరకు నామినేటెడ్ పదవుల జోలికెళ్లలేదు. వినాయకుడి పెళ్లి మాదిరిగా నామినేటెడ్ పదవుల భర్తీని వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. వీటిని తొందరగా భర్తీ చేయాలనే ఆలోచన కూడా చంద్రబాబులో కనిపించడం లేదు.

నెల్లూరుజిల్లా తెలుగుతమ్ముళ్ళు మాత్రం పదవుల కాంక్షతో ఎదురుచూస్తున్నారు. ఒకరిద్దరు నాయకులు రాజ్యసభ రేసులో ఉన్నారు. ఓ నలుగురు ముఖ్యనాయకులు ఎమ్మెల్సీ వ్యామోహంతో ఉన్నారు. ఇక నాయకులు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులతో పాటు జిల్లాలో దేవస్థాన కమిటీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఇతర నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. 8వ తేదీ వీళ్లంతా కూడా చంద్రబాబు దృష్టిలో పడేందుకు నానా తంటాలు పడ్డారు. సొంత ఖర్చుతో భారీగా ఫ్లెక్సీలు కట్టించారు. చంద్రబాబు కాన్వాయ్ వెళ్లే దారి పొడవునా తమ ఫోటోలు పెట్టుకుని మరీ స్వాగత ఆర్చీలు ఏర్పాటు చేశారు. చంద్రబాబును స్వయంగా కలుసుకుని తమ మనసులోని కోరికలు చెప్పే ప్రయత్నం కూడా చేశారు. అయితే చంద్రబాబు ఎవరికీ ఆ ఛాన్స్ ఇవ్వలేదు. ఎవరికి ఏ పదవులు అనేదానిపై ఎలాంటి భరోసా ఇవ్వకపోవడం, అసలు త్వరలోనే పదవులను భర్తీ చేస్తాననే మాట చంద్రబాబు నోట రాకపోవడం జిల్లా తెలుగుతమ్ముళ్లను తీవ్రంగా నిరుత్సాహపరచింది.


శ్రీరస్తు! శుభమస్తు!!
శ్రీ శ్రీ శ్రీ
**ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానము**



తూర్పు కనుపూరు, చిల్లకూరు మం., నెల్లూరుజిల్లా.
**జాతర మహోత్సవ ఆహ్వానము**
తేది. 17-3-15 మంగళవారం నుండి
తేది. 20-3-15 శుక్రవారం వరకు
కార్యక్రమ వివరములు


| | | |
|---|---|---|
| 17-3-2015 మంగళవారం | రాత్రి జాతర ప్రారంభం శ్రీ పోలేరమ్మ వారి "నిలుపు" | సా॥ 6-00 గం.ల నుంచి శ్రీ అమ్మవారి సామూహిక పల్లకీసేవ మరియు వివిధ రకములైన కూరగాయలు, పండ్లతో శాఖాంబరి అలంకారము కలదు. ఉభయదాతలు: విశ్వనాథ ఆగ్రో ప్రొడక్ట్స్ ఇంటర్నేషనల్ - చెన్నై, శ్రీ గజలక్ష్మి & కో., శ్రీ పి.బాలయ్యశెట్టి - చెన్నై |
| 18-3-2015 బుధవారం | "యారా" శ్రీ గురునాథస్వామి, శ్రీ అంకమ్మ దేవతల గ్రామ ఉత్సవము గొల్లల వేడుకలు | అమ్మవారికి పూలంగిసేవ అత్యంత వైభవంగా జరుగును. |
| 19-3-2015 గురువారం | పగలు శ్రీ గురునాథస్వామి గ్రామ ఉత్సవము రాత్రి శ్రీ అమ్మవారికి ఉయ్యాల సేవ | రాత్రి 8-00 గం॥లకు గొప్ప పాటకచ్చేరి మరియు సాంస్కృతిక కార్యక్రమములు |

తేది 20-3-2015 శుక్రవారం శ్రీ పోలేరమ్మను వెళ్ళనంపు ఉత్సవము జరుగును.



శ్రీ వరిదిరెడ్డి రామమోహన్‌రెడ్డి ఛైర్మెన్
తాతా శ్రీనివాసరావు కార్యనిర్వహణాధికారి
మరియు
ధర్మకర్తల మండలి సభ్యులు





## ప్రతాప్‌రెడ్డితో కోటంరెడ్డి మాటామంతి

అపోలో హాస్పిటల్ గ్రూప్ ఛైర్మెన్ ప్రతాప్ సి రెడ్డిని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 7వ తేదీ నెల్లూరులోని అపోలో హాస్పిటల్‌లో గౌరవ ప్రదంగా కలిశారు. నెల్లూరులోని పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో అపోలో వైద్య సేవలు ఉండే విధంగా చూడాలని ప్రతాప్ సి రెడ్డిని ఎమ్మెల్యే కోరారు.

## ఆత్మహత్యలకు కేరాఫ్ అడ్రస్ కలెక్టరేట్

సమస్యలు పరిష్కారం కానివారు ఆత్మహత్యలు చేసుకునేందుకు కేరాఫ్ అడ్రస్‌గా కలెక్టర్ కార్యాలయం పేరు సంపాదించుకొంటుంది. పోయిన సంవత్సరం ఒక రైతు తనకు అధికారులు న్యాయం చేయడం లేదంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఇప్పుడు రఘు అనే అతను తనపై తప్పుడు కేసులు పెట్టినా అధికారులు తనకు న్యాయం చేయడం లేదంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కలెక్టర్ కార్యాలయంలోకి ఎవరు వస్తున్నారో, ఎందుకు వస్తున్నారో తెలియదు. పోలీసుల తనిఖీలు లేకపోవడంతో ఎవరు పడితే వారు కలెక్టరేట్‌లోకి వచ్చి గంటలతరబడి ఉంటున్నారు. గతంలో జేసీ రేఖారాణి ఉన్నప్పుడు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి పోలీసులను సెక్యూరిటీగా పెట్టారు. ప్రైవేట్ వాహనాలు రాకుండా వచ్చే వారిని పరిశీలించి పంపించేవారు. ప్రస్తుతం అలా జరగడం లేదు. చెక్‌పోస్టు అలంకార ప్రాయంగా మారింది. కలెక్టరేట్ ప్రస్తుతం ఆత్మహత్యలకు నిలయంగా మారింది.




అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సింహపురి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం కార్యదర్శిగా విశిష్ట సేవలందిస్తున్న శ్రీమతి షేక్ షమీమ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు, ప్రముఖులు

## సాధనా పదయాత్ర

సన్నిధి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6గంటలకు నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు ప్రక్కనున్న శిరిడి సాయిసదన్ మందిరం నుండి గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామి మందిరం వరకు సకలజన శ్రేయస్సు కొరకు శ్రీ స్వామి వివేకానంద స్ఫూర్తితో సాధన పదయాత్ర సాగింది. పదయాత్ర ప్రతినెలా రెండవ ఆదివారం ఉదయం 6గంటలకు యధాప్రకారం కొనసాగుతుందని నిర్వాహకులు అల్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు.

### కాలధర్మం

## ఆలూరు సుజాత



కోవూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఆలూరు శ్రీనివాసులురెడ్డి సతీమణి ఆలూరు సుజాత ఈ నెల 10వ తేదీన స్వర్గస్తురాలైనారు. ఆమె వయస్సు 57 సంవత్సరాలు. హఠాత్తుగా అనారోగ్యానికి గురైన ఆమెను ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించినా ఫలితం లేకుండాపోయింది. ఆమెకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి కాగా, నెల్లూరు పొగతోటలోని ప్రముఖ దంతవైద్యశాల కేర్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డా॥ అలూరు స్వరూప్‌కుమార్ రెడ్డి ఆమె రెండవ కుమారుడు. ఆమె మరణంతో కోవూరు పాటూరురోడ్డులోని ఆమె ఇంట విషాదం అలుముకుంది. తమ ఇంటి దీపం ఆరిపోవడంతో ఆలూరు కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఆలూరు సుజాత ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# నెల్లూరు కబుర్లు

## హమ్మయ్యా... సిఎం సభ ముగిసింది

ఈ నెల 8వ తేదీన నెల్లూరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన విజయవతం కావడంతో జిల్లా తెలుగుదేశం నాయకులతో పాటు జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. సీఎం పర్యటన కోసం 1700మంది పోలీసు సిబ్బందిని నియమించారు. సిఎం కాన్వాయ్ వెళ్లే రోడ్డులో పోలీసు బందోబస్తును పటిష్టంగా పెట్టారు. సిఎం వస్తున్నాడని చెప్పి రోడ్ల మీద గుంటలు పూడ్చారు. మినీబైపాస్ రోడ్డును అందంగా ముస్తాబు చేశారు. కనుపర్తిపాడు సభలో మహిళలు భారీగా కనిపించాలని వెయ్యిదాకా బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలు ఏర్పాటు చేసి మహిళలను తరలించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా సీఎం సభను విజయవంతం చేసినందుకు తెలుగుదేశం నాయకులు, జిల్లా అధికారులు భుజాలెగరేసుకున్నారు.

## పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలి

యాభై ఎనిమిది రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆంధ్రరాష్ట్రం కొరకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలని కె.వి. చలమయ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. పొట్టి శ్రీరాములు మరణించి అరవైరెండు సంవత్సరాలు అయినందున ఆయన జయంతి మార్చి 16న, వర్ధంతి డిసెంబర్ 15న అధికారిక కార్యక్రమాలుగా ప్రకటించాలని మెమోరాండంలో కోరారు.

## ఎస్సైల బదిలీలు

నెల్లూరుజిల్లాలో ముగ్గురు ఎస్సైలను బదిలీ చేయడంతో పాటు తడ ఎస్సైను సస్పెండ్ చేస్తూ 7వ తేదీ జిల్లా ఎస్పీ ఎస్.సెంథిల్‌కుమార్ ఆదేశాలు జారీ చేసారు. నెల్లూరురూరల్ ఎస్సై వి.గిరి బాబును నాల్గవ నగర పోలీసుస్టేషన్‌కు, ఎస్.ఆర్.పురం ఎస్సై అహ్మద్‌బాషాను కందలేరుకు, విఆర్‌లో ఉన్న జిలానీని ఎస్ఆర్ పురానికి బదిలీ చేశారు. తడ ఎస్సై అబ్దుల్ రజాక్‌పై వివిధ ఆరోపణల నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేశారు. అబ్దుల్ రజాక్ ప్రధానంగా ఎన్నికల్లో పట్టుకున్న మద్యాన్ని వదిలి వేశాడన్న ఆరోపణలతో ఈ విషయాలన్నింటిపై విచారించిన ఎస్పీ ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


## ఐఆఎస్‌కు ఎస్పీ అభినందనలు



నెల్లూరు 2వ నగర పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న యం.పుల్లారెడ్డి కొడుకు యం.హర్షవర్ధన్‌రెడ్డి ఐఆఎస్‌లో 99వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్.సెంథిల్‌కుమార్ హర్షవర్ధన్‌రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు యం.ప్రసాద్‌రావు, ఏఎస్పీ రెడ్డిగంగాధర్‌రావు, సంఘం జిల్లా కార్యదర్శి జగన్మోహన్ రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం.. పుష్పయాగం

### భక్తజనసందోహంతో కిక్కిరిసిన శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయం



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 6 వ తేది రాత్రి అమ్మవారికి నేత్రపర్వంగా పుష్పయాగం జరిగింది. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి 41వ ప్రతిష్టాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని నయనానందకరంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకారాలతో శోభిల్లుతున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని, ఆలయంలోని ప్రత్యేకవేదికపై వేంచేపు చేసి 18రకాల సుగంధభరిత పుష్పాలతో కన్నుల పండువగా పుష్పయాగం నిర్వహించారు. భక్తులు, ముఖ్యంగా మహిళాభక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో తరలివచ్చి ఈ పుష్పయాగాన్ని ఆద్యంతం తిలకించి పరవశించిపోయారు. ఆలయ ప్రధాన అర్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ నేతృత్వంలో, కుప్పచ్చి సుబ్బారావు, రఘురామ మూర్తి తదితర వేదపండితులు అందరూ కలసి శాస్త్రోక్తంగా అమ్మవారికి నిర్వహించిన ఈ పుష్పయాగం భక్తులను బాగా ఆకట్టుకుంది. ఆలయప్రాంగణం భక్తజనసందోహంతో క్రిక్కిరిసిపోయింది. శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, పద్మావతమ్మలు ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఆలయ సహాయ కమిషనర్ కోదండరామిరెడ్డి, మూలస్థానేశ్వర దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే స్త్రీ శక్తి పురస్కారాలు



నెల్లూరు దర్గామిట్టలోని ఎన్జీఓ హోంలో మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహ నిర్మాణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు ఆరంబాకం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో 13మంది మహిళలకు సావిత్రిబాయి పూలే స్త్రీ శక్తి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అల్లు భాస్కర్‌రెడ్డి, ప్రత్యేక అతిథిగా పెరుగు రామకృష్ణ పాల్గొన్నారు. సుజనారామం, సావిత్రిబాయి పూలేను గురించి వివరించారు. శిరీష, నిఖిత భరతమాత ఔన్నత్యం తెలిపే పాటను గానం చేశారు. ఈ సందర్భంగా డా॥ సరోజాదేవి, డా॥ దివిజాదేవి, డా॥ జి.పద్మప్రియ, డా॥ యం.వినీత, డా॥ జిఎం శ్రీలత, బి.ప్రసన్న లక్ష్మి, కోడూరు ఇందిరమ్మ, పెరుగు సుజన, డి.సుబ్బలక్ష్మి, వసుంధర, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, కె.శైలజ, ఇ.కరుణమ్మలకు స్త్రీశక్తి పురస్కారాలు అందజేశారు.

## ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాతో పాటు ప్యాకేజీని ఇవ్వాలని కోరుతూ సింహపురి యువశక్తి సేవా సమితి వ్యవస్థాపకుడు బెజవాడ మేఘనాథ్ సింగ్ 7వ తేదీ స్వర్ణభారత్ ట్రస్ట్‌లో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుకు వినతిపత్రం సమర్పించారు.





## నెల్లూరీయులకు వైద్య వరంగా...

# ఆరోగ్యానికి చిరునామాగా 'అపోలో'



చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలలోని కార్పొరేట్ హాస్పిటల్స్‌ను తలదన్నే రీతిలో నెల్లూరు, ముత్తుకూరురోడ్డులో నిర్మించిన అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఈ నెల 8వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు.

అనంతరం హాస్పిటల్ ఆవరణలో వైద్యసేవలకు ఏర్పాటు చేసిన అత్యంత ఆధునీకరణ సాంకేతిక మౌలిక సదుపాయాలు, పరీక్షా ల్యాబొరేటరీలను పరిశీలించారు. తదుపరి ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ అత్యంత ఆధునీకరణ సాంకేతిక పరికరాలతో ఏర్పాటు చేసిన అపోలో హాస్పిటల్ వలన నెల్లూరుజిల్లాకే కాకుండా చిత్తూరు, ఒంగోలు, కడప తదితర ప్రాంతాల వారికి మెరుగైన వైద్య సౌకర్యం కల్పించేందుకు అనువుగా వుంటుందన్నారు. అమెరికాలో మాదిరిగా నెల్లూరులో అపోలో హాస్పిటల్ పెట్టడం అభినందనీయమన్నారు. నెల్లూరులో ఏర్పాటు చేసిన హాస్పిటల్ రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో కూడా ఏర్పాటు చేసి మెరుగైన వైద్యసౌకర్యం అందుబాటులోకి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవ ద్వారా ఆరోగ్యశ్రీకార్డులు వున్న వారికి 2.50లక్షల వరకు వైద్యసౌకర్యం కల్పించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం క్రింద దాదాపు 1050వ్యాధులు గుర్తించడం జరిగిందన్నారు. వైద్య సదుపాయాలు మెరుగుపరచేందుకు మెడికల్ స్కూల్స్, కాలేజీలు, పారామెడికల్ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి హాస్పిటల్ వద్ద దేవాలయాలు, చర్చిలు, మసీదులు ఏర్పాటు చేస్తే రోగులు హాస్పిటల్‌కు వచ్చిన సందర్భంలో దేవుడిని దర్శించుకుని హాస్పిటల్‌కు వెళ్తే జబ్బు నయమవుతుందనే నమ్మకం ఏర్పడుతుందన్నారు. సాధారణంగా అపోలో హాస్పిటల్ వైద్య సేవలను మరింత విస్తరింపజేసి ప్రజలకు అందుబాటులో వుండేలా చూడాలన్నారు. నెల్లూరును హెల్త్‌కేర్ హబ్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

రాష్ట్ర శాసనసభ స్పీకర్ డా॥ కోడెల శివప్రసాద్ మాట్లాడుతూ నెల్లూరు పట్టణంలో అత్యంత అధునాతన వైద్య సౌకర్యాలతో కూడిన హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని, వైద్య సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అపోలో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డా॥ ప్రతాప్ సి రెడ్డి మాట్లాడుతూ హాస్పిటల్‌ను 1983లో మొట్టమొదటి సారిగా చెన్నైలో ప్రారంభించామని, ఇప్పుడు నెల్లూరులో అత్యంత ఆధునిక వైద్యసదుపాయాలతో ఏర్పాటు చేసి, ముఖ్యమంత్రిచే ప్రారంభించడం జరిగిందని, ఈ హాస్పిటల్ పూర్తి డిజిటలైజ్డ్ హాస్పిటల్ అని, ప్రత్యేకంగా శిక్షణ పొందిన వైద్య సిబ్బందితో సేవలను అందించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమానికి అపోలో హాస్పిటల్స్ వైస్‌ఛైర్మెన్ డా॥ శోభనాగాంధీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డా॥ పొంగూరు నారాయణ, రాజ్యసభసభ్యులు టి.సుబ్బరామిరెడ్డి, నెల్లూరు నగర మేయర్ షేక్ అబ్దుల్‌అజీజ్, జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి, శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా ఎస్.పి. సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అపోలో అంటే ప్రజలకు ఒక భరోసా, ఆరోగ్యానికి భద్రత, మెరుగైన వైద్యానికి చిరునామా! నెల్లూరుప్రజలకు ఈ ఆసుపత్రిని అంకితం చేసిన డాక్టర్ ప్రతాప్ సి రెడ్డికి 'లాయర్' అభినందనలు.

## శ్రీసిటీలో ప్రభుత్వ ఉన్నతాధికారులు



ఢిల్లీలో ఏ.పి భవన్ రెసిడెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ సింఘాల్, ఏపిఐఐసి, ఎం.డి కె.వి.సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమల శాఖ డైరెక్టర్ కార్తికేయ మిశ్రా 7వ తేదీ శ్రీసిటీకి విచ్చేశారు. శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి వారికి స్వాగతం పలికి శ్రీసిటీ సాధించిన ప్రగతి గురించి వివరించారు. వారంతా శ్రీసిటీలోని కొన్ని పరిశ్రమలను దర్శించి ఆయా పరిశ్రమల గురించి వివరాలు తెలుసుకున్నారు.

తరువాత చెన్నై-బెంగుళూరు పారిశ్రామిక కారిడార్‌కు సంబంధించిన జపాన్‌కు చెందిన ప్రైస్ వాటర్హౌస్ కూపర్స్, నిప్పాన్‌కోయి కంపెనీ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో చెన్నై-విశాఖ పారిశ్రామిక కారిడార్‌పై కూడా చర్చించారు.




## నారాయణలో ఉచిత వైద్యశిబిరం

నెల్లూరురూరల్ మండలం చింతారెడ్డిపాలెంలోని నారాయణ హాస్పిటల్‌లో సోమవారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో వీర్యగ్రంధి వ్యాధుల ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దీనికి అనూహ్య స్పందన వచ్చినట్లు యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.సూర్యప్రకాష్ తెలిపారు. డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎం.వేణు, డాక్టర్ బి.విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ శంకర్, డాక్టర్ శివశంకర్‌రెడ్డి, డాక్టర్ లలిత్‌సాగర్, డాక్టర్ అనిల్‌కుమార్‌తో కూడిన యూరాలజీ బృందం 150మందికి పైగా వీర్యగ్రంధి వ్యాధులకు సంబంధించిన రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ 50సంవత్సరాలకు పైబడిన యాభైమంది, 50సంవత్సరాలకు లోపు 24మంది మహిళలకు వీర్యగ్రంధి, మూత్రకోశ వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు తెలిపారు. రోగులకు స్కానింగ్, పిఎస్‌ఏ రక్తపరీక్ష ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నారాయణ మెడికల్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం, సిఇఓ డాక్టర్ సి.విజయమోహన్‌రెడ్డి, ఏజిఎం భాస్కర్‌రెడ్డి పర్యవేక్షించారు.

## అంగరంగ వైభవంగా రంగనాథుని బ్రహ్మోత్సవాలు




నెల్లూరు రంగనాయకులపేటలో వేంచేసియున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో గత నెల 28న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామికి ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ సింహవాహనం, 4వ తేదీ హనుమంతసేవ, 5వ తేదీ బంగారు గరుడసేవ, 6వ తేదీ కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగాయి. 7వతేదీ ఉదయం శ్రీస్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. రథోత్సవ కార్యక్రమంలో నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. 8వ తేదీ అశ్వవాహనసేవ, 9వ తేదీ ప్రణయకలహోత్సవం(ముసుగుల సేవ), చక్రస్నానం, 10వ తేదీ పుష్పయాగం, రాత్రి ధ్వజావరోహణం, 11వ తేదీ పూలంగిసేవ, రాత్రి తెప్పోత్సవం వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాలను సహాయకమిషనర్ ఆలయ కార్యనిర్వహణాధికారి వేగూరు రవీంద్రరెడ్డి పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. భక్తులు వేలాదిగా పాల్గొని శ్రీ స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



## జగన్‌తో ప్రతాప్ భేటీ

కావలి నియోజకవర్గంలోని రైతులు సాగునీటి కోసం పడుతున్న బాధలను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి వైఎస్సార్సీపి అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వివరించారు. ఆయన ఇటీవల హైదరాబాద్‌కు వెళ్ళి జగన్‌ను కలిసి, తమ నియోజకవర్గంలోని సమస్యలను జగన్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఇక్కడి ప్రజలు సాగునీటికి, తాగునీటికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యల సాధన కోసం తాను ఇటీవల కావలిలో దీక్ష చేపట్టానని, అందుకు స్పందించిన మంత్రి డాక్టర్ నారాయణ కావలి కాలువను వెడల్పు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన జగన్‌కు వివరించారు. ఇటీవల నెల్లూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచ్చేసినప్పుడు, సంగం బ్యారేజీని త్వరగా పూర్తి చేయాలని, కావలి కాలువలను 1200 క్యూసెక్కుల నీటి సామర్థ్యం వుండేలా పెంచాలని, తద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించాలని తాను కోరినట్టు తెలిపారు. కావలి కాలువకు బైపాస్ కెనాల్‌ను నిర్మించి కావలి చెరువుకు నీటిని అందించాలని, డిఆర్, డిఎం ఛానళ్ళ పునరుద్ధరించాలని తాను సిఎం దృష్టికి తీసుకురాగా, అందుకు సిఎం సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరిస్తే సంతోషకరమని, ఒకవేళ హామీలు నెరవేర్చకపోతే రాష్ట్రంలో వైఎస్సార్సీపి అధికారంలోకి రాగానే మొదటి ప్రాధాన్యతగా సంగం బ్యారేజ్ నిర్మాణం, కావలి కాలువల ఆధునీకరణ పూర్తి చేస్తామని జగన్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ప్రతాప్ పేర్కొన్నారు.

## కల్యాణ వైభవం...!



గూడూరు మండలం నెలటూరు గ్రామ వాస్తవ్యులు నెలబల్లి భాస్కర్‌రెడ్డి - శ్రీమతి భారతిల కుమార్తె **ప్రవల్లిక - వెంకట తిరుమల రెడ్డి**ల వివాహం మరియు రిసెప్షన్ డా॥ సి.ఆర్.రెడ్డి కల్యాణ మండపం నందు ఈ నెల 6వ తేదీ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కొత్త జంటకు 'లాయర్' శుభాకాంక్షలు.

## గూడూరు డివిజన్ వార్తలు

# 17 నుండి ముత్యాలమ్మ జాతర



చిల్లకూరు మండలంలోని తూర్పుకను పూరు ముత్యాలమ్మ జాతర ఈ నెల 17వ తేదీ నుండి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. ముత్యాలమ్మకు నిత్యం అభిషేకాలు, కుంకుమార్చన, వస్త్రాలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ ప్రధాన పూజారి చాకిరి రమణయ్య తెలిపారు. ముత్యాలమ్మను కొలిచే వారిని చల్లగా చూస్తుందన్న ప్రగాఢ విశ్వాసం భక్తుల్లో బలంగా నాటుకుంది. ఉగాదికి ముందు నాలుగురోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించే జాతరకు దాదాపు పదిలక్షలమందికి పైగా భక్తులు తరలి వస్తారు. ఇక్కడకు వచ్చిన భక్తులు అమ్మ వారికి చీర, సారెలతో పాటు తలనీలాలు సమర్పిస్తారు. సంతానం లేని వారు ఇక్క దున్న రావిచెట్టుకు ముడుపులు కట్టుకొని మొక్కుకుంటారు. అలాగే కొందరు మహి ళలు ఆలయంలో వరపడి అమ్మవారిని సంతానప్రాప్తి కలుగజేయాలని వేడు కొంటారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి ఇక్కడకు చేరుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేస్తోంది.

### భారతీయ సంస్కృతి పరీక్షలో

## లిటిల్ ఏంజిల్స్ విద్యార్థికి తృతీయస్థానం



ముంగమూరు నుండి షీల్డ్ అందుకుంటున్న సాత్విక్

భారతీయ సంస్కృతి జ్ఞాన పరిరక్షణలో భాగంగా గాయత్రీ పరివార్ ప్రతి సంవత్సరం నిర్వహించే జ్ఞాన పరీక్షలు ఈ సంవత్సరం కూడా నిర్వహిం చారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు ఇటీవల నెల్లూరులోని అచ్యుత సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో బహుమతులు అందజేశారు. చిల్లకూరు లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థి ఆనిమెళ్ళ సాత్విక్ జిల్లా స్థాయిలో మూడోస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా నెల్లూరు నగర మాజీ శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి చేతుల మీదుగా షీల్డ్ అందుకున్నాడు.

## ఇన్నర్‌వీల్ మహిళా దినోత్సవ వేడుకలు



విజేతలకు బహుమతులిస్తున్న డాక్టర్ సుహాసిని

మహిళలకు విద్యతోనే పూర్తి భద్రత ఉంటుందని డాక్టర్ సుహాసిని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గూడూరులోని ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్తంగా ఆదివారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మహిళలు అన్ని రంగాల్లో వెనుకంజలో ఉండేవారని, కానీ నేడు వస్తున్న మార్పులతో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నా మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, వాటిని సమర్థంగా ఎదుర్కోవాలని కోరారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షులు విష్ణు వందన, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షులు బొమ్మిరెడ్డి మైథిలి, కార్యదర్శులు పరమేశ్వరి, వై.లక్ష్మి, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సి.రోహిణి, స్నేహలత, సునంద, సుప్రద, సౌందర్యమ్మ, కనుమూరు సీతారెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి న్యూస్

# శ్రీ వాసవీ అమ్మవారి 'మహాయజ్ఞం'



హోమంలో పాల్గొన్న తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య

చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పట్ట ణంలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, ఆర్యవైశ్య సంఘం సారథ్యంలో భారతదేశంలోనే మొట్టమొదటిసారి శ్రీ వాసవీ అమ్మవారి మూలమంత్రంతో "మహాయజ్ఞం" నిర్వహించారు. మంగళ వారం నుంచి ప్రారంభమైన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ పాలక మండలి అధ్యక్షులు తబ్జుల ఆనంద్‌రాజ్ గుప్తా, ఆర్యవైశ్య సంఘాధ్యక్షులు పొట్టి చంద్ర గుప్తాలు యజ్ఞం నిర్వహించడానికి తల మునకలయ్యారు. అధ్యక్షుల పర్యవేక్షణలో ఏర్పాట్లు విస్తృతంగా నిర్వహించారు. ఈసందర్భంగా మంగళవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య దంపతులు ఎంతో భక్తి శ్రద్ధలతో విచ్చేశారు. గవర్నర్‌కు ఎంజిఎం హోటల్ వద్ద అధికార లాంఛనాలతో అధికారులు స్వాగతం పలికారు. తర్వాత నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మహాయజ్ఞానికి విచ్చేశారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి మూలమంత్రంతో మహాయాగాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, కర్నాటకల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజ రయ్యారు. 10,11,12 తేదీల్లో ఉదయం నుంచి యాగ ప్రాంగణం వేదమంత్రా లతో దద్దరిల్లింది. 102 కలశాలతో, 102 హోమగుండాల్ని ఏర్పాటు చేసి కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. ఎంతో మహిమాన్వితమైన ఈ యజ్ఞాన్ని యువకులైన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం పాలకమండలి, ఆర్యవైశ్య సంఘం సారథ్యంలో వ్యయప్రయాసలతో చేశారు. భారతదేశంలోనే మొట్టమొదటి సారి పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ఈ యాగాన్ని నిర్వహించడం ఎంతో ప్రాశస్త్యం కలిగి ఉంది. అనంతరం పూర్ణాహుతిలో పాల్గొన్న గవర్నర్ పత్రికల వారిని, భక్తులనుద్దేశించి మాట్లాడుతూ పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయం భువుగా వెలసిన దివ్యక్షేత్రంలో ఈ యాగాన్ని నిర్వహించి లోకకళ్యాణానికి కృషి చేసిన యువకులైన నాయకుల్ని అభినందించారు. అంతేకాకుండా పుణ్య క్షేత్రాల్లో శ్రీకాళహస్తికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి. ఇక్కడ మానవునికి అత్యంత ప్రాధాన్యత కలిగిన వాయురూపంలో ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. 102 కలశాలు, 102 హోమగుండాల్ని ఒకచోట ఏర్పాటు చేసి యాగం నిర్వ హించడం అనేది చాలా అరుదన్నారు. 102 మంది గోత్రీకుల్ని ఒక చోటకు చేర్చే ప్రయత్నం సాహసంతో కూడుకున్న దనేన్నారు. యజ్ఞ యాగాదులు రుతువుల్ని సక్రమంగా నడుపుటకు ఉపయోగపడు తాయన్నారు. తాను చెన్నై నుంచే ఆశీర్వ దించవచ్చు, కాని అమ్మవారి మహాయాగం నిర్వహణ ఓ వరం లాంటిదన్నారు. కాబట్టి తాను ప్రత్యక్షంగా పాల్గొనడానికి వచ్చా నన్నారు. ఇక సక్రమ ప్రవర్తనలకు దారి చూపుతుందన్నారు. నేడు ప్రకృతిలో చోటు చేసుకున్న వాతావరణం, కలియుగంలో సంభవిస్తున్న విపత్తుల్ని తట్టుకొనుటకు ఇలాంటి యాగాలు నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. మంత్రానికి ఎంతో శక్తి ఉందని వేదఘోషతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.

ఈ మహాయాగానికి డిఎస్పీ వెంకట కిశోర్ బందోబస్తు నిర్వహించగా, శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు, తిరుపతి ఆర్‌డిఓ వీరబ్రహ్మయ్య, శ్రీకాళహస్తి తహశీల్దార్ చంద్రమోహన్, ఆర్యవైశ్య చిత్తూరు జిల్లా అధ్యక్షులు రాచమడుగు సుభాష్ చంద్రబోస్. ఐతా మురళీ, మాజీ మున్సిపల్ చైర్మన్ శాంతారాం జె.పవార్, మున్సిపల్ చైర్మన్ రాధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ సాయి నారాయణ మందిరంలో

## జిల్లా స్థాయి భక్తి గీతాల పోటీలు



గూడూరు రెండవ పట్టణంలోని జానకిరాం పేట శ్రీసాయి నారాయణ మందిరం నందు మం దిర వ్యవస్థాపకులు డా॥ మేడా ఆదిశేషారెడ్డి సతీ మణి కీ॥శే॥ డాక్టర్ మేడా విజయలక్ష్మి ద్వితీయ వర్ధంతి సందర్భంగా జిల్లా స్థాయి భక్తిగీతాల పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి నెల్లూరు రత్నం స్కూల్‌కు చెందిన చందన, ద్వితీయ మరియు తృతీయ బహుమతులు గూడూరు జీవిఎస్ స్కూల్‌కు చెందిన గ్రీష్మ, ప్రాస్‌పరో స్కూలుకు చెందిన కుషాలి గెలుపొందారు. వీరికి క్యాష్ అవార్డు మరియు మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో మందిర ట్రస్టీ మేడా ఆదిశేషారెడ్డి, ప్రోగ్రామ్ కన్వీనర్ జి.శ్రీనివాసకుమార్‌లు పాల్గొన్నారు.

## లయన్స్ సేవలు అభినందనీయం



అమృతవల్లిని సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

గూడూరులోని రోటరీ భవనంలో ఆది వారం లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మూడో క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ అమృతవల్లి పాల్గొని మాట్లాడుతూ క్లబ్ చేస్తున్న సేవలను అభినం దించారు. వైద్య, విద్య పరంగా సేవలు మరింత విస్తృతపరచాలన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గవర్నర్ అమృతవల్లిని, మరికొంతమంది మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మధుసూదన్‌శాస్త్రి, డాక్టర్ లలితా, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌నాయుడు, ఎన్.నవీన్ జయకుమార్, కోశాధికారి జిల్లా చంద్రశేఖర్, మల్లు విజయకుమార్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్ తదితర లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక లావాదేవీలు, ఇంట బయట వ్యవహారాలు సమర్థవంతంగా నిర్వహించగలరు. శరీరానికి గాయాలు తగలడం, స్వల్ప అనారోగ్య బాధలుండి సర్దుకొంటాయి. ఆదాయానికి సరిపోవునట్లు కుటుంబ ఖర్చులకు ప్రణాళిక ఏర్పరచుకొంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలు బాగుండి, ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తులు, షేర్లపై ఆదాయం ఉంటుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కోర్టు వ్యవహారాలలో అనుకూలత, స్థిరాస్తులు భూములు వంటి వాటి క్రయవిక్రయాలు జరుగగలవు. ఉద్యోగులు అసోసియేషన్ కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తివ్యాపారాలలో ఆర్థికావకాశాలు బాగుంటాయి. ఆదాయం పెరుగుతుంది. పనులు నిర్వహించేటప్పుడు ఘర్షణాత్మక వైఖరి లేకుండా సామరస్యంగా ఉండండి. స్థిరాస్తుల మీద ఆదాయముంటుంది.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

పరిశ్రమల యజమానులకు, వ్యవసాయదారులకు పనివాళ్ళతో సమస్యలుంటాయి. అనుకున్న పనులకు ఆటంకాలు కలుగుతాయి. ఈ వారం ఖర్చులు అధికంగా ఉంటాయి. వృత్తి నిర్వహణలో నిలబడగలరు. రావలసిన బాకీలు వాయిదా పడగలవు. స్థిరాస్తుల క్రయవిక్రయాల విషయంలో పునరాలోచన చేస్తారు. బంధుమిత్రులను కలుసుకొంటారు. విద్యాప్రగతి బాగుంటుంది.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర1, 2పాదాలు

విద్యాప్రగతి బాగుంటుంది. యజమానులకు వర్కర్లతో సమస్యలుండవచ్చును. అనుకున్న పనులు పట్టుదలతో సాధించుకుంటారు. వృత్తి వ్యాపారాలలో పోటీలను అధిగమించి ఆర్థికంగా అభివృద్ధి సాధించగలరు. ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాల ఖర్చులు, ఇంటి ఖర్చులు పెరుగుతాయి. స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు జరుగుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 13.03.2015 నుండి
తేది. 19.03.2015 వరకు

ఈ వారం మేషంలో కుజుడు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, వృశ్చిక, మకర, ధనస్సు, కుంభంలలో చంద్రుడు, మకరంలో బుధుడు, మీనంలో రవి కుజ కేతువులు సంచరిస్తారు.

పంచాంగము:
ముహూర్తములు లేవు

**ఫాల్గుణ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 13 | శుక్ర | సప్తమి | ఉ॥ గం.6.31వ॥ |
| | పిదప | అష్టమి | పూర్తిగ |
| తేది. 14 | శని | నవమి | రా॥గం.4.43వ॥ |
| తేది. 15 | ఆది | దశమి | రా॥గం.3.05వ॥ |
| తేది. 16 | సోమ | ఏకాదశి | రా॥గం.1.12వ॥ |
| తేది. 17 | మంగళ | ద్వాదశి | రా॥గం.11.03వ॥ |
| తేది. 18 | బుధ | త్రయోదశి | రా॥గం.8.44వ॥ |
| తేది. 19 | గురు | చతుర్దశి | రా॥గం.6.21వ॥ |

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

చేపట్టిన పనులకు అనుకూల పరిస్థితులుండి నెరవేర్చుకొంటారు. కుటుంబసౌఖ్యము, ప్రశాంతత పొందుతారు. దూరప్రాంతాల నుండి అయినవాళ్ళ క్షేమ సమాచారాలు తెలుస్తాయి. క్రొత్త పెట్టుబడులు, స్థిరాస్తుల లావాదేవీల పై నిర్ణయం తీసుకొంటారు. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం, ఆర్థికావకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది.

### మిథునం



మృగశిర 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

సామాజిక కార్యక్రమాలు, దైవ కార్యక్రమాలలో ప్రముఖ బాధ్యత వహిస్తారు. ఖర్చులు పెరిగినా ఆర్థికంగా ఇబ్బందులుండవు. వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులను దాటుకొని ఆదాయం పెంచుకొంటారు. ఆడిట్ అకౌంట్స్ రంగాల వారికి పనివత్తిడి బాగుంటుంది. అనుకున్న పనులను సమర్థవంతంగా నిర్వహిస్తారు. అధికారులకు స్థాన చలనం ఉంటుంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి నిర్వహణలో ఇబ్బందులుండి అధిగమిస్తారు. దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకొంటారు. రాజకీయ వర్గాలకు తమ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ముఖ్యసంప్రదింపులు, ఒప్పందాలలో అనుకూలత ఉంటుంది. వ్యాపారవృద్ధికి ప్రణాళికలు అమలు చేస్తారు. వ్యాపార పోటీ తట్టుకొని ఆదాయం పెంచుతుంటారు. విద్యాప్రగతి బాగుంటుంది.


### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కుటుంబంలో అనుకూలత తక్కువగా వుంటుంది. రావలసిన బాకీలపై వత్తిడి పెంచండి. ప్రభుత్వ అనుమతులు వాయిదా పడవచ్చును. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అనుభవం ఉంటుంది. ఆదాయం పెరుగుతుంది. అయినా ఏదో విధంగా ఖర్చులు పెరుగుతాయి. ఇతరులపై ఆధారపడకుండా సొంత నిర్ణయాలు చేయండి. స్థిరాస్తులు కొనడం జరుగుతుంది.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపార పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు దొరుకుతాయి. వృత్తి వ్యాపారాలలో పోటీ తట్టుకొని ఆదాయం పెంచుకొంటారు. ఆర్థిక లావాదేవీలందు జాగ్రత్త అవసరం. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. సంభాషణ పరుషంగా లేకుండా చూచుకొనండి. స్థిరాస్తులను ఏర్పరచుకొనే ప్రయత్నాలు చేస్తారు. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు. ఖర్చులు కొద్ది పెరిగినా ప్రయోజనకరంగా ఉంటాయి.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

దూరప్రయాణాలుండటం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఉద్యోగులకు పనిభారం, ప్రభుత్వ వత్తిడులుంటాయి. అనుకున్న పనులు ముందు వెనుకలుగా జరుగుతూ ఆందోళన కలిగిస్తాయి. వ్యాపార వర్గాలకు శ్రమకు తగ్గ ఆదాయం ఉండదు. వృత్తుల జీవనం కలవారికి అవకాశాలు బాగుంటాయి. ఇంట్లో శుభకార్య నిర్ణయం కావచ్చు. ఋణ పరిష్కారాలు చేసుకొంటారు.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బిడ్డల విద్య, వివాహ విషయాలలో శ్రద్ధ చూపుతారు. అప్పుడప్పుడు అన్ని విషయాలలో టెన్షన్ పడుతుంటారు. వృత్తి వ్యాపకాలు పెరిగి ఆదాయం బాగుంటుంది. మీ సంకల్పాలకు అనుకూల పరిస్థితులుండి పనులు జరుగుతాయి. వ్యాపారాలలో పోటీని అధిగమించి అవకాశాలు, ఆదాయాన్ని పెంచుకుంటారు. వాహన ఫైనాన్స్, చీటీల వ్యాపారులు జాగ్రత్త పడాలి.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం కాగలదు. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. ఈ వారం ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ప్రాబల్యం, మంచి అవకాశాలుండి ఆదాయం మార్గములను పెంచుకొనే ప్రయత్నం చేస్తారు. ఉద్యోగ, వ్యాపార వర్గాలపై అధికారుల దాడులుండగలవు. స్థిరాస్తులు, షేర్ల మీద ఆదాయం ఉంటుంది.

## మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుదాం



చర్చా వేదికలో ప్రసంగిస్తున్న యన్.వి.సుబ్బయ్య

పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రత్నమ్మ ఛారిటబుల్ సొసైటి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరు రూరల్ మండలం బుజబుజనెల్లూరులోని శ్రీనివాస ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో మహిళలపై జరుగుతున్న ఆగడాలను అరికట్టాలనే ఉద్దేశ్యంతో సంస్థ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు సభాధ్యక్షులుగా 'మృగాళ్ళకు సంకెళ్లేద్దాం – మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుదాం' అనే అంశంపై చర్చా వేదిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ పాల్గొని మాట్లాడుతూ మహిళలపై హత్యలు, అఘాయిత్యాలు అధికమైపోతుండడం బాధాకరమని, పోలీసులు, విద్యార్థులు ప్రజలు దృష్టి సారించి నియంత్రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుభద్రాదేవి, రవి గోగులపల్లి, రాచపాళెం రఘు, హరికృష్ణ, ప్రభాకర్‌రాజు, రామ్‌ప్రభు తదితరులు పాల్గొన్నారు.

### మహిళలు
## అన్ని రంగాల్లో రాణించాలి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నెల్లూరు రామ్మూర్తినగర్ ఓనర్స్ అసోసియేషన్ లేడీస్ వింగ్ ఆధ్వర్యంలో బాలవీరయ్య కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, ఇతర ఆటలలో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. వేమిరెడ్డి శ్యామలమ్మ మెమోరియల్ – 2015 బహుమతిని డా॥ పుట్ట శాలినికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నీరజ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రొట్టెల పండుగకు మంచి గుర్తింపు

నెల్లూరు దర్గామిట్టలోని బారాషాహిద్ దర్గా రొట్టెల పండుగను రాష్ట్ర ప్రభుత్వ పండుగల్లో చేర్చడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని మాజీవక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ యన్.ఎ.యం.హుస్సేని తెలిపారు. ఈ పండుగ భారతదేశంలోనే మత సామరస్యానికి ప్రతీక అని, ప్రతియేటా దాదాపు 10లక్షల మంది కులమతాలకు అతీతంగా రొట్టెల పండుగలో పాల్గొంటారని తెలిపారు. నగర మేయర్ కార్పొరేషన్ కౌన్సిల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి పట్టుదలతో కృషి చేసి రాష్ట్ర ప్రభుత్వ పండుగగా గుర్తింపు తీసుకొచ్చినందున నెల్లూరు జిల్లా ప్రజలందరి తరపున అభినందనలు తెలియజేశారు.

## శ్రీనివాస అగ్రహారంలో మహిళా దినోత్సవం



వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న శ్రీమతి రాధికారెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీనివాస అగ్రహారం హౌస్ ఓనర్స్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శ్రీ నేతాజీ (ఎంఎస్ఆర్) పైలట్ హైస్కూల్ అధ్యక్షురాలు వేదవతి సుబ్బారెడ్డి మహిళలకు ఆటల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వి.ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీమతి రాధికారెడ్డి, కోవూరు ఐద్వా అధ్యక్షురాలు డా॥ ఇందిర, జక్కా శేషమ్మ, భువన హాజరై మహిళలు వాకింగ్ చేసేందుకు వాకింగ్‌ట్రాక్‌ను ప్రారంభించారు.

అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. మ్యూజికల్ ఛైర్, బాల్‌త్రో, బాల్‌త్రో ఇన్‌టూ బాస్కెట్ మొదలగు ఆటలను నిర్వహించారు. మహిళా విభాగం అధ్యక్షురాలు వేదవతి, కార్యదర్శి కల్పన, కోశాధికారి యం.లక్ష్మి, కార్యక్రమ ఛైర్మెన్ బి.సరళ, భవాని, మాలిని, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, అసోసియేషన్‌లోని మహిళా సభ్యులు పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వి.సుబ్బారెడ్డి, కార్యదర్శి జి.కృష్ణారెడ్డి, కోశాధికారి ఎం.చంద్రమౌళి, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

## జర్నలిస్టులందరికీ ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలి

### – ముఖ్యమంత్రికి హౌస్‌బిల్డింగ్ సొసైటీ వినతి

జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళ స్థలాలు మంజూరుచేయాలని ది నెల్లూరు జర్నలిస్ట్స్ మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటి సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నెల్లూరుకు విచ్చేసిన ముఖ్యమంత్రికి ఆ మేరకు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జయరాజ్ మాట్లాడుతూ కొత్తూరులోని న్యూ జర్నలిస్ట్ కాలనీలో 246 మందికి 30అంకణాల వంతున ఇళ్ళ స్థలాలు ఇచ్చారని, ఇంకా 400 మందికిపైగా జర్నలిస్ట్‌లు ఇళ్ళ స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వీరందరినీ దృష్టిలో వుంచుకుని త్వరితగతిన ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ చేసిన జర్నలిస్ట్‌లకు పింఛన్ మంజూరు, ప్రభుత్వ సహాయనిధిని ఏర్పాటు చేయాలని కోరారు. వీటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం, మంత్రి డాక్టర్ పి.నారాయణకు, జిల్లా కలెక్టర్ జానకికి సొసైటీ కార్యవర్గసభ్యులు వినతిపత్రాలు సమర్పించారు. సిఎంను కలిసినవారిలో సొసైటీ కార్యదర్శి సునీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు గోపీనాథ్, డైరెక్టర్లు కె. హరిబాబు, ఎస్‌డి జాకీర్, బి.రాజన్, ఎ.మల్లికార్జున, ఎస్. కోటేశ్వరరావు, డి.సురేష్ తదితరులున్నారు.

# కళ్యాణ వైభవం...!



ఏసి సంపూజనా సమితి అధ్యక్షులు నాగారెడ్డి హరిశ్చంద్రారెడ్డి మనుమరాలు, స్వర్గీయ నాగారెడ్డి నరేంద్రరెడ్డి - శ్రీలతల కుమార్తె **సాయిస్రవంతి - సుదీప్‌రెడ్డి** (కొత్తపాళెం వాస్తవ్యులు స్వర్గీయ రాజేంద్రప్రసాద్‌రెడ్డి - గిరిజమ్మల కుమారుడు)ల కల్యాణం ఫిబ్రవరి 27వ తేదీ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ కల్యాణ మండపంలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



వైకాపా నాయకులు మల్లు సుధాకర్‌రెడ్డి సోదరుడు మల్లు రామ్మోహన్‌రెడ్డి - అమరావతిల కుమార్తె **పూజితారెడ్డి - జగన్‌మోహన్‌రెడ్డి** (దుత్తలూరు మండలం సోమలరేగడ వాస్తవ్యులు పెద్దిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి - సుబ్బరత్నమ్మల కుమారుడు)ల వివాహం ఈ నెల 6వ తేదీ నెల్లూరులోని ఏఎన్ఆర్ కల్యాణ మండపం నందు జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనలు.

# బాధితులకు సాయం ఏదీ?..

అగ్నిప్రమాద బాధితులకు గత ఏడాదికాలంగా ఇళ్ళు మంజూరుచేయడం లేదని, సర్వస్వం కోల్పోయిన బాధితులు చెట్లకింద కాపురం వుంటున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో తన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేంద్రప్రభుత్వం నుంచి విడుదలయ్యే ఇందిర ఆవాజ్ యోజన పథకం కింద జిల్లా కలెక్టర్‌లు బాధితులకు ఇళ్ళు మంజూరుచేసేవారని, రెండు మూడు వారాల్లోనే ఇళ్ళు మంజూరవుతుండేవని, అయితే ఇప్పుడు గత ఏడాది కాలంగా ప్రభుత్వం ఇళ్ళు నిర్మించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. కొత్త ఇళ్ళు మంజూరు కానీ, కట్టుకున్న ఇళ్లకు చెల్లింపులు కానీ చేయనటువంటి ఈ ప్రభుత్వం ఇందిరా ఆవాజ్ యోజన క్రింద ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల వివరాలు తెలపాలని, అసలు ఆ నిధుల వినియోగం తదితర అంశాలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. అందుకు మంత్రి కిమిడి మృణాళిని సమాధానమిస్తూ, ఇళ్ళు మంజూరు చేయడం లేదన్నది వాస్తవమని, అగ్నిప్రమాద బాధితులకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 3275 ఇళ్ళు పెండింగ్‌లో వున్నాయని తెలిపారు. అయితే, ఇందిరా ఆవాజ్‌యోజన పథకం క్రింద కేంద్రం విడుదల చేసిన నిధుల వినియోగంపై స్పష్టంగా సమాధానం చెప్పాలని కాకాణి పట్టుబట్టారు. రాష్ట్రచరిత్రలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ళు కట్టించి ఇవ్వాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేసిన వ్యక్తి దివంగత నేత డాక్టర్ వైఎస్ అని, మరో వంద జన్మలెత్తినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డా.వైఎస్‌లాగా పరిపాలన అందించలేరని అన్నారు.

# పవన్‌కు దారేది?

(మొదటిపేజీ తరువాయి)

పోయింది. ఇక చిరంజీవి రాజకీయ భవిష్యత్ ఏంటన్నది ఆ భగవంతుడికే తెలియాలి. చిరంజీవి రాజకీయ మనుగడ కనీసం అయిదారేళ్లన్నా కనిపించింది. పార్టీ పెట్టడం, ఎన్నికల్లో పోటీ చేయడం, కేంద్రమంత్రి కావడం వంటివన్నా ఆయన జీవితంలో జరిగాయి. చిరంజీవి ప్రజల్లో పలుచబడిపోవడానికి కొంత కాలమన్నా పట్టింది. పవన్ తన ఇమేజ్‌ను కోల్పోవడానికి ఎక్కువ టైం కూడా తీసుకునేటట్లు లేదు. 2014 ఎన్నికల్లో పవన్ జనసేన పార్టీని పెట్టాడు. అయితే ఎన్నికల్లో పోటీ చేయలేదు. బీజేపీ – టీడీపీల కూటమికి మద్దతుగా పనిచేశాడు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు వస్తేనే మీకు న్యాయం జరుగుతుందని ప్రజలను నమ్మించాడు. పవన్‌కు అన్ని కులాలు, అన్ని మతాలలోనూ అభిమానులున్నారు. పవన్ ప్రభావం కొంతన్నా వారిమీద ఉంటుంది. ఇక పవన్ ప్రభావంతో కాపు వర్గం తెలుగుదేశంకు దగ్గరైంది. రాష్ట్రంలో తెలుగుదేశం విజయంలో పవన్ పాత్ర చాలానే వుంది.

అయితే ఎటువంటి రాజకీయ పదవులు అనుభవించకుండానే చంద్రబాబు మూలంగా పవన్ అన్‌పాపులర్ అవుతున్నాడు. ఈమధ్య రాజధానిలో ఆయన పర్యటించాడు. రైతులకు అన్యాయం జరుగుతుందంటూ నిలదీసాడు. అవసరమైతే వారి తరపున పోరాడుతానని కూడా హెచ్చరించాడు. ఇంతవరకు బాగానేవుంది. హైదరాబాద్‌కు వెళ్లిన తర్వాత ఆయన వాయిస్ మారింది. రాజధానికి భూములిచ్చిన రైతులకు ప్రభుత్వమిస్తున్న ప్యాకేజీ బ్రహ్మాండంగా వుందంటూ కితాబిచ్చాడు. చంద్రబాబు ఏం మంత్రం వేసాడో గాని పవన్ మాట మార్చాడు. రాజధాని రైతుల కోసం తాను పోరాటం చేస్తానని పవన్ అన్నప్పుడు ఆయనను అభినందించిన వాళ్లే, మాట మార్చగానే ఇతనికంటే చిరంజీవి బెటర్ అంటూ వ్యాఖ్యానించసాగారు. రాజధాని భూముల విషయంలో చంద్రబాబుకు వత్తాసు పలకడంతో పవన్ ఇమేజ్‌ను కోల్పోతున్నాడు.

# వింజమూరు గ్రామపంచాయితి కార్యాలయము

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.

ఆర్.ఓ.సి.నెం.15/2015ఎ1 తేది.12.03.2015

## వేలం మరియు టెండరు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వింజమూరు గ్రామ పంచాయితీకి చెందిన ఈ క్రింద షెడ్యూలు–1లో కనుపరిచినవి తే.23.03.2015ది ఉదయం 11.00గంటలకు వింజమూరు గ్రామపంచాయితి కార్యాలయము నందు బహిరంగ వేలము జరుపబడును. సదరు వేలములో పాల్గొనదలచినవారు ఆయా వివరములకు ఎదురుగా పొందుపరచిన సదరు మొత్తము నగదుగా చెల్లించి వేలమునందు పాల్గొనవచ్చును. మరియు షెడ్యూలు–2లో కనుపరిచిన వస్తువులు తదితరములు సరఫరా చేయుటకు ఆయా వివరములు ఎదురుగా పొందుపరచిన టెండరు ధరావత్తు రుసుము చెల్లించి సీల్డు టెండర్లును తే.23.03.2015ది ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00గంటల వరకు వింజమూరు గ్రామ పంచాయితి కార్యాలయములో స్వీకరించబడును. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 3.00గంటలకు హాజరయిన టెండరుదారుల సమక్షమున తెరవబడును.

### షెడ్యూలు–1

| వ.నెం. | వివరములు | ఆస్తి విలువ | ధరావత్తు రూ. |
|---|---|---|---|
| 1. | గ్రామపంచాయితి కార్యాలయములో నున్న పనికిరాని కాలిపోయిన ట్యూబులైట్లు, చోకులు మరియు ఇతరములు వేలం. | – | 200–00 |
| 2. | గ్రామపంచాయితి కార్యాలయములో నున్న పనికిరాని పాత పి.డబ్ల్యు.యస్., జి.ఐ., సామానులు వేలం | – | 200–00 |
| 3. | గ్రామపంచాయితి కార్యాలయములో నున్న పాత న్యూస్‌పేపర్లు వేలం | – | 200–00 |

### షెడ్యూలు–2

| వ.నెం. | వివరములు | ధరావత్తు రూ. |
|---|---|---|
| 1. | గ్రామపంచాయితికి 2015–16వ సం॥మునకు వీధి విద్యుత్ దీపములు విడిభాగములు దఫాలు వారిగా సరఫరా చేయుట (శ్రీయుత జిల్లా కలెక్టరు నెల్లూరు వారి ఆమోదపు రేట్లకు లోబడి, గుర్తింపు పొందిన డీలర్లు మాత్రమే) | 500–00 |
| 2. | గ్రామపంచాయితికి 2015–16వ సం॥మునకు అవసరమగు పి.డబ్ల్యు.యస్ విడి భాగములు దఫాలు వారిగా సరఫరా చేయుట (ఐ.టి.యస్, ఫినోలెక్స్, కుమార్, సుధాకర్ మరియు నంది పైపుల ఆథీకృత డీలర్లు మాత్రమే.) | 500–00 |
| 3. | గ్రామపంచాయితి పి.డబ్ల్యు.యస్ స్కీములకు చెందిన 10హెచ్‌పి, 7.5హెచ్‌పి, 5హెచ్‌పి సబ్‌మెర్సిబుల్ మరియు మోనోబ్లాక్ మోటార్లు కాలిపోయినపుడు రీవైండింగు మరియు ఇతరములు రిపేరు చేయుట (హార్స్ పవర్ రేటు ఉదహరించి తీసి వేసిన కాపర్ రేటు మినహాయించి రేటును పేర్కొనవలయును.) | 500–00 |
| 4. | గ్రామపంచాయితికి 2015–16వ సం॥మునకు అవసరమగు ప్రజారోగ్య సామాన్లు (బ్లీచింగ్, సున్నము, ఫినాయిల్ మరియు ఇతరములు) దఫాలువారిగా సరఫరా చేయుట. | 500–00 |
| 5. | గ్రామపంచాయితికి 2015–16వ సం॥మునకు అవసరమగు ప్రజారోగ్య పారిశుద్ధ్య సామాన్లు పనులకు అవసరమైన పనిముట్లు) దఫాలు వారిగా సరఫరా చేయుట. | 500–00 |

సూచన: 1) షెడ్యూలు 2లో కనుపరిచిన వస్తువులు సరఫరా చేయుటకు ఆథీకృత డీలర్లు మాత్రమే సీల్డు టెండర్లు దాఖలు చేయవలయును.
2) వేలము మరియు టెండరు తేదీని ప్రభుత్వము వారు అనివార్య కారణము వలన శెలవు దినముగా ప్రకటించినచో మరుసటి కార్యాలయము పనిచేయు రోజున నిర్వహించబడును.
3) వేలము గాని, టెండర్లు గాని పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దు చేయుటకు గాని లేక వాయిదా వేయుటకు గాని, గ్రామ పంచాయితి వారికి అధికారము కలదు.
4) ఇతర వివరములు గ్రామపంచాయితి కార్యాలయము పని చేయు వేళలయందు అడిగి తెలుసుకోవచ్చును.

**సం/- సి.హెచ్.వరప్రసాద్ రావు,**
**పంచాయతీ కార్యదర్శి, వింజమూరు గ్రామపంచాయతి.**

# సభా సమరం

(మొదటిపేజీ తరువాయి)

కొత్త, పాతల కలయితో సమావేశాలప్పుడు ఎంతో ఆరోగ్యకర చర్చలు జరుగుతుండేవి. 2009అసెంబ్లీలో కూడా మంచి మంచి వక్తలు, ప్రజా సమస్యలపై పోరాడే సభ్యులుండేవాళ్లు.

రాష్ట్ర విభజనతో రాష్ట్ర స్వరూపమే కాదు, రాష్ట్ర శాసనసభ స్వరూపం కూడా మారిపోయింది. శాసనసభ భవనం కూడా మారింది. దాంతోపాటు కొత్త అసెంబ్లీలో సభ్యులు కూడా దాదాపు అందరూ కొత్తవాళ్లే అయ్యారు. ప్రస్తుతం ఏపి శాసన సభ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న తీరు చూస్తుంటే చాలా నిరాశాజనకంగా కనిపిస్తుంది. ఈ అసెంబ్లీలో ఎక్కువశాతం మంది కొత్తసభ్యులే ఉన్నారు. నిరంతరం ప్రజల మధ్య తిరుగుతూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ఎన్నికల్లో నిలబడి గెలిచిన వాళ్లు చాలా తక్కువ. సభలో కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారాలలో నిష్ణాతులైన వాళ్లు ఎక్కువ మంది ఎమ్మెల్యేలుగా గెలిచి సభలో కూర్చున్నారు. వీళ్లకు ప్రజాసమస్యలపై పట్టు లేదు. తెలుగుదేశం, వైకాపా... రెండు పార్టీలలోనూ ఇలాంటి ఎమ్మెల్యేలు దండిగానే ఉన్నారు. ప్రజా సమస్యలపై ఘాటుగా మాట్లాడగల సభ్యులు చాలా తక్కువ.

ఈ సభలో అధికారపక్షం రాష్ట్ర సమస్యల మీద, ప్రజల సమస్యల మీద సమగ్రంగా వివరణ ఇవ్వలేకపోతోంది. విపక్ష వైకాపా సభ్యులు ఏ ఆరోపణలు చేసినా, తిప్పి కొట్టడానికి అధికారపక్షం ఎంచుకున్న మార్గం దివంగత నేత వై.యస్.పై బురద చల్లడం. వై.యస్.ను జనం మరచిపోయేటట్లున్నా తెలుగుదేశం నాయకులు మరచిపోనివ్వడం లేదు. ప్రతిరోజూ వై.యస్. నామస్మరణ చేయనిదే వీళ్లకు పూటగడిచేటట్లు లేదు. అధికారపక్ష నాయకుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పలుసార్లు అసహనానికి గురవుతున్నారు. ఆయన దృష్టిలో మిగతా సభ్యులంతా బచ్చాలుగా కనిపిస్తున్నారు. ప్రభుత్వంలోని మంత్రులు కాని, ఎమ్మెల్యేలు కాని చాలామంది నోటికేది వస్తే అది మాట్లాడుతున్నారు. చంద్రబాబు మెప్పు కోసం వై.యస్.ను తిట్టే ప్రోగ్రాం పెట్టుకుంటున్నారు. వైకాపా సభ్యులలో కొంతమంది గట్టిగానే మాట్లాడుతున్నారు. సమస్యలపై తమ వాయిస్‌ను బాగానే వినిపిస్తున్నారు. అసెంబ్లీ వేదికగా అధికార పక్షాన్ని ముప్పతిప్పలు పెట్టడానికి ప్రతిపక్ష వైకాపా ముందు ఎన్నో అవకాశాలున్నప్పటికీ వాళ్లు వాటిని సద్వినియోగం చేసుకోలేకున్నారు.

గతంలో శాసనసభ సమావేశాలు చూస్తుంటే ఆసక్తికర చర్చలు, హావభావాలు, ఉద్వేగాలు, జోకులు, కథలు... వంటివెన్నో అంశాలుండేవి. అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష ప్రసారాన్ని వన్డే క్రికెట్ మ్యాచ్ మాదిరిగా చూసేవాళ్లు. ఇప్పుడు సమావేశాలలో ఒకరిపై ఒకరు నోర్లు పారేసుకోవడం తప్పించి ఇంకే ఉపయోగం కనిపించడం లేదు.

# ఎమ్మెల్సీ వార్

(మొదటిపేజీ తరువాయి)

ఈ జిల్లాలో సోమిరెడ్డికి ప్రాధాన్యత తగ్గించే ప్రయత్నం జరిగింది. జిల్లాలో నారాయణకు మంత్రి పదవి ఇచ్చారు. సోమిరెడ్డితో పని లేకుండా జిల్లాలో పార్టీని ముందుకు తీసుకెళ్లమని చంద్రబాబే సంకేతాలిచ్చాడు. అయితే ఈ 9నెలల కాలంలో పార్టీ ముందుకు పోవడం మాట అటుంచి శరవేగంగా వెనక్కుపోయింది. మంత్రి నారాయణ రాజకీయంగా అనుభవజ్ఞుడు కాకపోవడంతో అందర్నీ కలుపుకుపోలేకున్నారు. వర్గ విభేదాలు కూడా మరీ ఎక్కువయ్యాయి. జిల్లాలో సోమిరెడ్డి నాయకత్వముంటేనే పార్టీ పుంజుకుంటుందని కార్యకర్తలు అభిప్రాయపడసాగారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు కూడా సోమిరెడ్డి పట్ల తన అభిప్రాయాన్ని మార్చుకున్నట్లు తెలుస్తుంది. త్వరలోనే ఎమ్మెల్యేల కోటాలో సోమిరెడ్డికి ఎమ్మెల్సీ అవకాశాన్ని కల్పించవచ్చని సమాచారం.

బీద రవిచంద్ర రాజ్యసభ కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే రాజ్యసభకు బదులు ఆయనకు బీసీ కోటాలో ఎమ్మెల్సీ ఇస్తారనే ప్రచారం వుంది. ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా రాజ్యసభ లేదా ఎమ్మెల్సీలను ఆశిస్తున్నారు. కాని సోమిరెడ్డి, బీదల తర్వాతే జిల్లాలో మిగిలిన నాయకులకు ప్రాధాన్యత లభించే అవకాశముంది.

గల్పిక

# అప్పులిస్తే బ్యాంకర్లపై కేసులు

## – చంద్రబాబు ఆదేశం

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సందడిగా వుంది. ముదురు దోమలశాఖ మంత్రి పి.నారాయణ, తెలుగుదేశం నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద రవిచంద్ర, బీద మస్తాన్‌రావు, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అనూరాధ, రమేష్‌రెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వంటి నాయకులంతా వున్నారు. ఇంకో పది నిముషాలలో హెలికాప్టర్ ల్యాండ్ కాబోతున్నట్లు ఎస్పీ సెంథిల్‌కుమార్ చెప్పాడు. దాంతో జిల్లా తెలుగుదేశం నాయకులంతా అలర్ట్ అయ్యారు. నారాయణ భుజం మీద సోమిరెడ్డి, సోమిరెడ్డి భుజం మీద ఆదాల, ఆదాల భుజం మీద పోలంరెడ్డి, ఈయన భుజం మీద పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, అజీజ్ భుజం మీద డాక్టర్ జడ్.యస్., ఆయన భుజం మీద కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అనూరాధ భుజం మీద అంచలవాణి... ఇలా అందరూ ఒకరి భుజాల మీద ఒకరు చేతులు వేసుకుని ప్రాణ స్నేహితులంటే ఇలా ఉండాలి... అన్న పొజిషన్‌లో నిలబడ్డారు. అప్పుడే హెలికాప్టర్ వచ్చి ల్యాండయ్యింది. హైటెక్‌రత్న చంద్రబాబు దిగాడు. ఎదురుగా నిలబడి ఉన్న తెలుగుదేశం నాయకుల వైపు చూసాడు. అంతే... ఆనందంతో ఆయనకు నోట మాటరాలేదు. కళ్ల వెంట ఆనందభాష్పాలు రాలుతున్నాయి. కొద్దిసేపటికి తేరుకుని గద్గదస్వరంతో... ఎన్నోఏళ్లుగా నేను కలలు కంటున్న సీన్ ఇదే... నా కలలు ఈరోజుకు ఫలించాయి. మీ స్నేహం ఇలాగే చిరకాలం వర్ధిల్లాలంటూ ఆయన తన పర్సనల్ కెమెరాతో నాయకులంతా కలిసి వున్న ఫోటోను తీసాడు. ఈ ఫోటోను నా పడకగదిలో కాదు, నా గుండెల్లో పెట్టుకుంటాను. నా జీవితాంతం ఇది మరచిపోలేని చిత్రమని చంద్రబాబు చెప్పాడు. తర్వాత అందరూ చంద్రబాబుకు పూలబొకేలు ఇచ్చారు. వాటిని చూసి చంద్రబాబు... వీటికి డబ్బులు ఖర్చు పెట్టకుండా ఆ డబ్బులేవో స్మార్ట్‌విలేజ్‌లకు పెట్టుండొచ్చు కదా అని అడిగాడు. దానికి మేయర్ అజీజ్... మాకు అంత నాలెడ్జ్ లేదనుకున్నారా సార్, ఇవి కొన్న బొకేలు కాదు, రెండు నెలల క్రితం నీరు–చెట్టు ప్రోగ్రాం క్రింద నెల్లూరు సిటీలో పూల మొక్కలు నాటాం. అవిప్పుడు బాగా పూలు పూస్తున్నాయి. ఆ పూలతో చేసినవే ఈ బొకేలు అని చెప్పాడు. చంద్రబాబు అజీజ్ భుజం తట్టి, శెభాష్... మిగిలిన పూలను కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు అమ్ము కోండి, వచ్చిన డబ్బుతో నెల్లూరును స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసుకోండి అని చెప్పి కారెక్కాడు. కాన్వాయ్ బయలుదేరింది.

★★★★★

కనుపర్తిపాడు జడ్పీ హైస్కూల్ ప్రాంగణం. భారీగా మహిళలు వచ్చి ఉన్నారు. కాన్వాయ్ వచ్చి ఆగింది. చంద్రబాబు వచ్చి దిగాడు. అప్పుడే ఓ వృద్ధుడు వచ్చి నాకు పింఛన్ రావడం లేదయ్యా అంటూ చంద్రబాబుకు ఓ అర్జీ ఇచ్చాడు. చంద్రబాబు ఆ అర్జీని మంత్రి నారాయణ చేతికిచ్చి పరిశీలించమన్నాడు. మంత్రి నారాయణ దానిని జిల్లా కలెక్టర్ ఎం.జానకికిచ్చి చూడమన్నాడు. కలెక్టర్ దానిని జాయింట్‌కలెక్టర్ ఇంతియాజ్‌కు ఇచ్చింది. జేసీ దానిని డిఆర్ఓ సుదర్శన్‌రెడ్డికి, ఆయన ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డికి, ఈయన తహశీల్దార్ జనార్ధన్ రావుకు ఆయన విఆర్ఓకు ఇచ్చి ఒకరికొకరు దీనిని పరిశీలించడంటూ ఆదేశాలిచ్చుకున్నారు. ఆ వృద్ధుడి కళ్ల ముందే సిఎం నుండి విఆర్ఓ దాకా అర్జీ చేతులు మారింది. ఆ వృద్ధుడు విఆర్ఓ దగ్గరకెళ్లి సార్, నాకు పింఛన్ ఎప్పుడొస్తుంది అని అడిగాడు. విఆర్ఓ బదులిస్తూ... నేను వెరిఫై చేసి తహశీల్దార్‌కు ఫైలు పెడతాను, ఆయన చూసి ఆర్‌డిఓకు, ఆర్డీఓ డిఆర్ఓకు, ఆయన జేసీకి, జేసీ కలెక్టర్‌కు, కలెక్టర్ సంతకం చేసి మంత్రికి ఫైలు పంపిస్తారు. మంత్రి ఓకే చేసి చివరగా సిఎంకు ఫైలు పెడతారు. సీఎం ఫైలు సమగ్రంగా చదివి, నీకు పింఛన్ ఇవ్వడం న్యాయమేనని ఆయన మనసుకు అనిపిస్తే ఓకే చేస్తారు. అప్పుడు నీకు నెలనెలా పింఛన్ వస్తుందని చెప్పాడు. ఇదంతా కావడానికి ఎంత టైం పడుతుందయ్యా అని ఆ వృద్ధుడు అడిగాడు. తొందరగానే అయిపోతుందిలే పెద్దాయన... మహాఅంటే నాలుగేళ్లు పట్టొచ్చని చెప్పాడు. ఆ వృద్ధుడు మారు మాట్లాడకుండా విఆర్ఓ చేతిలో వున్న అర్జీ లాక్కుని మీకో దండం, మీ పింఛన్‌కో దండం అంటూ వెళ్లిపోయాడు. చంద్రబాబు వేదికనెక్కి మైకందుకున్నాడు. ఈరోజు మహిళా దినోత్సవం. అంటే లేడీస్‌డే, అంటే ఇది మీ రోజు... మీ సమస్యలు తీర్చడం మా బాధ్యత, మీరంతా మహిళా సదస్సు అనే కదా ఇక్కడకు వచ్చారని చంద్రబాబు అన్నాడు. సభలో నుండి సుబ్బమ్మ అనే మహిళ లేచి... మేం మహిళా సదస్సు కోసం అని రాలేదు నాయనా, మా ఊరు జంగాలకండ్రిక... బస్టాండ్‌లో ఎంతసేపు కూర్చున్నా మా ఊరికెళ్లే బస్సు రాలేదు... ఏమైందబ్బా అని ఆరాతీస్తే మా ఊరికెళ్లే బస్సు ఇక్కడ ఉన్నట్లు తెలిసింది. మీటింగ్ అయ్యాక టిక్కెట్ లేకుండానే ఆ బస్సులో మా ఊరికి పంపిస్తారంటగా, అందుకే వచ్చానని చెప్పింది. ఆమె మాటలు వినగానే చంద్రబాబు... చూసారా, మహిళల్లో ఎంతటి చైతన్యం వచ్చిందో, ఆమె ఊరికెళ్లే బస్సు ఇక్కడ ఉందని కనిపెట్టగలిగిందంటే, ఆమెకు చాలా తెలివి ఉండాలి, మా ప్రభుత్వంలో మహిళలు చైతన్యవంతులవుతారనే దానికి ఇదే నిదర్శనమని చెప్పాడు. తర్వాత కీర్తి కనకమ్మ అనే మహిళ లేచి... సార్, మీరొస్తే మద్య పాన నిషేధం విధిస్తారనుకున్నాం, ఇప్పుడు మగోళ్లు తాగేది ఎక్కువైంది, సంసారాలు గుల్లవుతున్నాయని అంది. వెంటనే చంద్రబాబు.. కనకమ్మా... మీరు చెప్పినదాంట్లో వాస్తవం లేదు. మొగుడు పెళ్లాంతో ప్రేమగా మాట్లాడేది తాగిన మైకంలోనే... తాగినోళ్లు నూటికి 90మంది భార్యాబిడ్డలతో ప్రేమగానే ఉంటారు. కాని మద్యం ప్రభావంతో వచ్చే ఆ ప్రేమాభిమానాలు ఎవరి కంటికీ కనపడవు. వందకు 10మంది మాత్రమే తాగిన మైకంలో భార్యా బిడ్డలను హింసిస్తుంటారు, ఇది మాత్రమే లోకానికి, మీడియాకు కనిపిస్తాయి. అంతెందుకు విడాకులనే తీసుకోండి, మొగుడు తాగుబోతు అన్న కారణంగా విడాకులు తీసుకున్న వాళ్లు కనిపించరు. ఇతర కారణాలతోనే విడాకుల కేసులు ఎక్కువవుతున్నాయి. కాబట్టి మద్యం భార్యాభర్తల మధ్య ప్రేమను పెంచుతుందేకాని బంధాన్ని తెంచదమ్మా... మద్యంకున్న పవిత్రశక్తి అలాంటిదని చంద్రబాబు ఉపదేశించాడు. మద్యానికి ప్రేమను మిక్స్ చేసి చెప్పిన చంద్రబాబు లాజిక్‌కు అందరూ ఆశ్చర్యపోయి రెండు నిముషాల తర్వాత చప్పట్లు కొట్టారు. తర్వాత సభలో నుండి వెంకమ్మ అనే మహిళ, పుల్లయ్య అనే రైతు లేచారు. వెంకమ్మ వుండి... సార్, డ్వాక్రా గ్రూపు క్రింద అప్పు తీసుకున్నాను, ఇప్పుడు బాకీ కట్టామని సతాయిస్తున్నారు, ఋణ మాఫీ కాక మేము అప్పులపాలయ్యామని చెప్పు కుంది. రైతు పుల్లయ్య వుండి... సార్, పొలానికని చెప్పి బ్యాంకులో అప్పు తీసుకున్నాను, ఇప్పుడు అప్పు తిరిగి కట్టమని ప్రతిరోజూ వేధిస్తున్నారని చెప్పు కున్నాడు. వెంటనే చంద్రబాబు... మీ అప్పుల కథలు వింటే నాకు కన్నీళ్లు వస్తున్నాయి. మీరు అప్పుల పాలు కావడానికి కారణం ఆ బ్యాంకుల వాళ్లు అప్పులు ఇవ్వబట్టే. ఇక నేను ఉపేక్షించను అని ఆవేశంగా అంటుంటే, చంద్రబాబు స్పాట్‌లో డ్వాక్రా, రైతు ఋణాలను పూర్తిగా రద్దు చేసేటట్లున్నాడని మహిళలు, రైతులు ఆనందపడసాగారు. చంద్రబాబు కలెక్టర్ జానకితో... బ్యాంకర్లను ఒళ్లు దగ్గర పెట్టుకోమని చెప్పండి... మహిళలను, రైతులను అప్పుల్లో ముంచుతారా? ఇకగాని వాళ్లకు అప్పులిచ్చి వాళ్లని కట్టమని వేధిస్తే కేసులు పెడతామని హెచ్చరించండని ఆదేశించాడు. ఆ మాటలు విని సభలో వున్న మహిళలు, రైతులు నోరెళ్లబెట్టారు.

## కదంబం

### పంజా

చిన్ని నారాయణరావు
నెల్లూరు. 94402 02942

ఇక్కడ –
మానవ మస్తిష్కాన్ని
ఓ పెనుభూతం జడలు విప్పి
సవాలు విసురుతున్నది
కాలం లోయల్ని తొలచి
మానవ సమాజాన్ని దహించివేస్తున్నది
ఆ రాకాసి దేశ సంపదను కొల్లగొట్టి
గోదాముల్లోకి తరలిస్తోంది
జనం మెదళ్ళ చుట్టూ చేరి చెదలు పూలు
పూయిస్తున్నది
బోన్సాయిలుగా రూపాంతరం చెందే జాతి
మనుగడే ప్రశ్నార్థకమవుతున్నది
దేనికైనా మందుందేమోగాని
దావానలమై ఈ ఉపద్రవం ఆపడానికి
అడ్డుకట్టలేదు
ఏకాంట్రాక్టరూ కట్టలేని డ్యాముల్తో
ఆ జబ్బు ముదిరి డేంజరుగా మారింది
ఓనా భారతీయ శాస్త్రవేత్తలారా
మీ ఆలోచనల సేంద్రీయ ఎరువుల్తో
భువిని సశ్యశ్యామలంచేసిన మేధావుల్లారా
మీరు –
శుష్కించిన భారతీయుల దేహాలకు
సరికొత్త జీవం పోయండి
అవినీతి గాయాల రుగ్మతల్ని రూపు మాపేలా
యుద్ధానికి సిద్ధం కండి
ఈ వ్యసనం భారతీయతను కబళించకముందే
కల్లోలిత భారతాన్ని ఆవిష్కరించకముందే
విధ్వంస వేకువను సృష్టించండి
మరో సూర్యోదయం కోసం
వెలుతుటి జెండాను ఎగురవేయండి
నిద్రాణమైన జాతిని మేల్కొల్పేలా
పంజావిప్పి చరించండి!



## బాలసుధాకర్‌మౌళికి ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు

ప్రతిష్ఠాత్మకమైన 'ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు – 2014' కోసం బాలసుధాకరమౌళి కవితా సంపుటి 'ఎగరాల్సిన సమయం' ఎంపికైనట్లు అవార్డు వ్యవస్థాపకులు డా॥ రాధేయ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవార్డు న్యాయనిర్ణేతలుగా కె.శివారెడ్డి, డా॥ రెంటాల శ్రీవేంకటేశ్వరరావు, డా॥ కోయి కోటేశ్వరరావులు వ్యవహరించారు. ఇప్పటివరకూ ఈ అవార్డు పొందిన కవుల్లో బాలసుధాకరమౌళి 27వ వారు. ఈ అవార్డు పొందిన కవిత్వం తన మొదటి పుస్తకం కావడం విశేషం. ఇందులో ఉత్తరాంధ్ర జనజీవితాన్ని చక్కగా చిత్రించారని న్యాయనిర్ణేతలు పేర్కొన్నారు. అవార్డు ప్రదానసభ జూలై నెలలో అనంతపురంలో జరుగుతుందని డా॥ రాధేయ తెలియజేశారు.

## సుంకర గోపాలయ్యకు 'మోపూరు' పురస్కారం

తమ తండ్రి మోపూరు పెంచలనాయుడు స్మారకార్థం ఈ ఏడాది ప్రదానం చేయనున్న మన్మథనామ ఉగాది పురస్కారాన్ని జిల్లాలోని కోట గ్రామానికి చెందిన ప్రముఖ కవి సుంకర గోపాలయ్యకు ప్రదానం చేయనున్నామని పెన్నా రచయితల సంఘం నిర్వాహకులు మోపూరు పెంచలనరసింహం, గోవిందరాజు సుభద్రాదేవి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 15వ తేది సాయంత్రం 6 గంటలకు నెల్లూరులోని జూ. రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారకభవన్‌లో జరిగే ఈ పురస్కార ప్రదానోత్సవంలో కవులు, సాహిత్యాభిమానులు, ప్రజలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ఈ సందర్భంగా 'ఉగాది కవిసమ్మేళనం' కూడా నిర్వహిస్తున్నామని, కవులందరూ ఈ కవిసమ్మేళనంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

## సాంస్కృతిక పోటీలు



ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నెల్లూరు సుబేదారుపేటలోని మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో నృత్య, పాటల పోటీలు జరిగాయి. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు సుధావాణి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విరుగు సుబ్రహ్మణ్యం, సంస్థ అధ్యక్షులు కేతా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి

అంగన్‌వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ సిఐటియూ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు సోమవారం నెల్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో అంగన్‌వాడీ వర్కర్లను భాగస్వాములు చేయడం సరికాదన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న పోరాటాల్లో భాగంగా ఈ నెల 13న ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడి చేయనున్నామన్నారు. ఈ నెల 17న ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తెలిపారు. అనంతరం తహశీల్దార్ జనార్ధన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియూ నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# చంద్రబాబు వచ్చారు... జిల్లాకు ఏమిచ్చారు?





ఇంతకుముందు ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వచ్చిపోయాడంటే దాని ప్రబావం కొంతన్నా ఉండేది. మనం బంధువుల ఇళ్లకు వెళ్లేటప్పుడు స్వీట్లు, ఫ్రూట్లు మర్యాదగా తీసుకెళతాం. ఇంతకుముందు ముఖ్యమంత్రుల పర్యటనలు అలానే ఉండేవి. సీఎం ఒక ప్రాంతానికి వెళ్లాడంటే ఖచ్చితంగా ఆ ప్రాంతానికి చెందిన ఒకట్రెండు అభివృద్ధి పనులకన్నా శంకుస్థాపనలు జరిగేవి. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడైతే ఏ ప్రాంతానికి వెళ్లినా కనీసం నాలుగైదు ప్రాజెక్టులకైనా శంకుస్థాపనలు చేసేవాడు. ముఖ్యమంత్రి వస్తే మన ప్రాంతానికి వరాలిస్తాడనే సంస్కృతిని ఆయనే అలవాటు చేసి పెట్టాడు. ఆయన తర్వాత ఏ సిఎం జిల్లాకు వచ్చినా ప్రజలు వై.యస్. హయాంలో లాగానే వరాలను ఆశిస్తున్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక నాలుగోసారి నెల్లూరు జిల్లాకు వచ్చాడు. వట్టి చేతులు, ఉత్త హామీలు తప్ప ఇంకేమీ లేవు. ఖజానాలో డబ్బున్నా లేకపోయినా ధారాళంగా వరాలిచ్చే స్వభావం చంద్రబాబుకు లేదు. వై.యస్. అయితే ఖజానాలో నూటపదహారు రూపాయలు లేకున్నా వరాలు మాత్రం వందలు, వేలకోట్లను దాటేవి. అందరు సిఎంలు వై.యస్.లు కాలేరుగా!

ఇక 8వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చారు. వై.యస్. హెలికాప్టర్ సంఘటన తర్వాత సీఎంలు దూరప్రయాణాలకు హెలికాప్టర్లను వాడడం లేదు. చంద్రబాబు స్పెషల్ ఫ్లైట్‌లో రేణిగుంటకు వచ్చి అక్కడ నుండి హెలికాప్టర్‌లో నెల్లూరు పోలీస్‌గ్రౌండ్‌లో దిగారు. మొదట అపోలో హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కనుపర్తిపాడు జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన మహిళా సదస్సులో పాల్గొన్నారు. మహిళా సదస్సు కాబట్టి వేదిక మీద మహిళలకే అవకాశం కల్పించారు. మహిళామంత్రులు కమిడి మృణాళిని, పీతల సుజాత, తెలుగు మహిళ అధ్యక్షురాలు శోభా హైమావతి, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.అనూరాధ, జిల్లా మహిళా అధ్యక్షురాలు అంచల వాణి, జిల్లాకలెక్టర్ ఎం.జానకిలు వేదికపై కూర్చున్నారు. అధికారిక హోదాలో మగవాళ్లుగా స్పీకర్ కోడెల శివప్రసాద్, మంత్రి పి.నారాయణ, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌లు మాత్రమే వేదికపై ఆశీనులయ్యారు. అలనాటి నటీమణి షావుకారు జానకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇక వివిధ రంగాలలో నిష్ణాతులై మహిళా లోకానికే మణిపూసలుగా నిలిచిన సారా వ్యతిరేకోద్యమ నాయకురాలు దూబగుంట రోశమ్మ, అనాధాశ్రమ నిర్వాహకురాలు జయఫిలిప్స్, చెన్నుపాటి విద్య, డి.సుశీల, రోజలిక, విజయలక్ష్మి, లలితాదాస్, లలితా కామేశ్వరి, శైలజాకిరణ్, విజయదుర్గ, నల్లాని ఈశ్వరిలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా సత్కరించారు. ఈ సభలో చంద్రబాబు మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడం కోసం డ్వాక్రా సంఘాలకు ఇసుకరీచ్‌లు అప్పగించానని, వారి సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టానని చెప్పుకొచ్చారు. జిల్లా అభివృద్ధికి ఆయన ప్రత్యేకంగా చేస్తున్నదేమీ చెప్పలేదు. ఆల్‌రెడీ జిల్లాకు వస్తున్న ప్రాజెక్ట్‌ల గురించే చెప్పారు. వెయ్యి బస్సులు పెట్టి పెద్దఎత్తున ఖర్చుపెట్టి ఈ సభ నిర్వహించారు. దాని ఫలితమేంటో అర్థం కావడం లేదు.

## రాజధాని కోసం మెట్టుకూరు విరాళం




ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణం కోసం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి 10లక్షల రూపాయల విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. జిల్లాలోని సహకార సంఘాల ద్వారా సేకరించిన 5లక్షలు, జిల్లా కేంద్ర సహకారబ్యాంకు ద్వారా మరో 5లక్షలు కలిపి 10లక్షల చెక్కును 8వ తేదీ నెల్లూరు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రికి అందజేశారు.



ఈ నెల 7వ తేదీన ఆదిత్యనగర్‌లోని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నివాసగృహానికి వెళ్ళి కొత్త దంపతులు హైందవి-బాలానంద్‌రెడ్డిలను ఆశీర్వదిస్తున్న కేంద్ర పట్టణాభివృద్ధిశాఖామంత్రి యం.వెంకయ్యనాయుడు

## మహిళలు ప్రగతివైపు అడుగులు వేయాలి

**- నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి**




అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ప్రగతివైపు అడుగులు వేయాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో ఏపి ఎన్జీఓ సంఘం మహిళా విభాగం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు కొనసాగిన మహిళల ఆటలపోటీలను మంగళవారం కలెక్టర్ జానకి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 33శాతం రిజర్వేషన్ సౌకర్యం ఉన్నప్పటికి ఆశించిన స్థాయిలో ఫలితాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పురుషులకు సమానంగా 50శాతం రిజర్వేషన్లు మహిళలకు అవసరమన్న అభిప్రాయం తన వ్యక్తిగతమన్నారు. క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందడమే కాకుండా మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ సి.వి.రమాదేవి, ఏఐఎస్‌జిఈఎస్ కార్యవర్గ సభ్యురాలు ఎం.రాజ్యలక్ష్మి, ఏపి ఎన్జీఓ సంఘం మహిళా విభాగం నెల్లూరుజిల్లా శాఖ ఛైర్‌పర్సన్ కె.శైలజ, జిల్లా కన్వీనర్ షేక్ ఆషాబేగం, రాష్ట్ర ఎన్జీఓ సంఘం మహిళా విభాగం కో-కన్వీనర్ ఈ.కరుణమ్మ, ఏపి ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు సిహెచ్ విఆర్‌సి శేఖర్‌రావు, వై.రమణారెడ్డి, ఉపాధ్యక్షులు సుధాకర్‌రావు, శ్రీకాంత్‌రావు, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com